వినతులు ఆలకించి.. భరోసా ఇచ్చి!!

తెదేపా కార్యాలయంలో మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్



మంత్రి లోకేశ్‌కు వినతులిచ్చేందుకు బారులు తీరిన ప్రజలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రెండు రోజుల విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం తెదేపా కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. వారి బాధలను శ్రద్ధగా ఆలకించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతులు స్వీకరించడంతో పాటు మంత్రి వారితో ఆత్మీయంగా మాట్లాడారు.

- బర్మా కాందిశీకుల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, అందుకు మద్దతు ఇస్తున్న వారిపై చర్యలు తీసుకుని, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని బర్మా ఆంధ్రా కాందిశీకుల సంఘం ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు.
- 2013లో నియామకమైన ఆర్టీసీ డ్రైవర్ల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఒప్పంద ఆర్టీసీ డ్రైవర్లు కోరారు. వైకాపా ప్రభుత్వంలో పీఆర్సీ అమలు చేయక, తీవ్రంగా నష్టపోయామని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.
- భీమునిపట్నంలో నగదు చెల్లించి 78 సెంట్ల భూమి కొనుగోలు చేశామని, దీనికి రిజిస్ట్రేషన్ చేయకుండా వైకాపా అండతో ఓ నేత ఇబ్బందులకు గురి చేస్తున్నారని, విచారణ జరిపి తగు చర్యలను తీసుకోవాలని ఒకరు ఫిర్యాదు చేశారు.
- గత వైకాపా పాలనలో చంద్రబాబు అక్రమ అరెస్టు విని తన భర్త గుండెపోటుతో మరణించారని, దీంతో తమ కుటుంబానికి ఎలాంటి ఆధారం లేకుండా పోయిందని అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం కండపాలేనికి చెందిన ధారాలక్ష్మి మంత్రి ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. తనకు వడ్డాది కేజీబీవీ నందు ఏదైనా ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు.
- ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన నగదును కుమార్తెల వివాహం కోసం అగ్రిగోల్డ్‌లో పొదుపు చేశానని, సంస్థ బోర్డు తిప్పేయడంతో రోడ్డున పడ్డామని శ్రీకాకుళానికి చెందిన కొర్లమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి ఆధారం లేదని, తమ డిపాజిట్ తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. అలాగే పలువురు తమ కుటుంబీకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

- అధికారులు చేసిన తప్పునకు న్యాయం కోసం పడిగాపులు కాస్తున్నానని, విశాఖ గ్రామీణ ప్రాంతానికి చెందిన చిన్నారావు మంత్రి లోకేశ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. 2012లో వుడా అనుమతులున్న 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశానని, 35 ఏళ్ల తర్వాత ఆ భూమిని నిషేధిత జాబితాలో చేర్చారని, తనకు న్యాయం చేయాలని కోరారు.



మంత్రి నారా లోకేశ్‌కు తన గోడు వివరిస్తున్న కొర్లమ్మ

లోకేశ్ దృష్టికి నిర్మాణ రంగ సమస్యలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను పరిష్కరించాలని క్రెడాయ్ ప్రతినిధుల బృందం మంత్రి లోకేశ్‌ను కోరింది. శుక్రవారం తెదేపా కార్యాలయంలో క్రెడాయ్ ఛైర్మన్ కేఎస్ఆర్‌కే రాజు, అధ్యక్షుడు వి.ధర్మేందర్, కార్యదర్శి వి.శ్రీను, ఉపాధ్యక్షుడు సీహెచ్.గోవిందరాజు మంత్రి లోకేశ్‌ను కలిశారు. ఆయా సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని క్రెడాయ్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే: మంత్రి లోకేశ్‌ను విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ నాయకులు గండి వంశీ, రాజశేఖర్, డేవిడ్ తదితరులు కలిశారు. అమరావతిలో జరిగిన తెదేపా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ బాధ్యుల సమావేశానికి పలువురు వెళ్లడంతో వారెవరూ పార్టీ కార్యాలయానికి రాలేకపోయారు.




మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు, చిత్రంలో ఎంపీ శ్రీభరత్

అతివలూ.. అప్రమత్తమైతేనే!

మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

తొలిదశలో గుర్తిస్తే నివారణ సాధ్యం

ఈనాడు, విశాఖపట్నం



రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల బారిన పడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. జీవనశైలి మార్పులు, సరైన ఆహారం తీసుకోకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు తదితర కారణాలతో ఎక్కువ మంది వీటి బారిన పడుతున్నారు.

వ్యాధిని ముందుగా గుర్తించే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడానికి చాలా మంది మహిళలు వెనకడుగు వేస్తున్నారు. ఎక్కువ మంది తీవ్రత పెరిగిన తర్వాతే ఆసుపత్రులకు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రాథమిక దశలో గుర్తించి, చికిత్స తీసుకుంటే తక్కువ ఖర్చులో నివారణ సాధ్యమేనని పేర్కొంటున్నారు.

స్వీయ పరీక్ష చేసుకుంటే: గతంలో రొమ్ము క్యాన్సర్ రెండో స్థానంలో ఉంటే ప్రస్తుతం మొదటి స్థానానికి చేరింది. వయసు పెరిగేకొద్దీ ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. 20 ఏళ్లు దాటిన అమ్మాయిలు స్వీయ రొమ్ము పరీక్ష చేసుకోవాలి. 30 ఏళ్లు దాటిన తర్వాత ఏడాదికోసారి వైద్యులను కలిసి రొమ్ము పరీక్షలు, 40 ఏళ్లు దాటితే మామోగ్రామ్ చేయించుకోవాలి. స్వీయ పరీక్షపై అవగాహన పెంచుకుంటే తొలి దశలోనే వ్యాధిని గుర్తించవచ్చు.

మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో గతేడాది గుర్తించిన కేసులు (సుమారు)



హెచ్‌పీవీ టీకాతో రక్షణ: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు తొలి దశలో గుర్తించేందుకు ఏడాదికోసారి పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవాలి. అది చేయించుకుంటే ఏదైనా ఇన్‌ఫెక్షన్లు ఉంటే ముందుగానే తెలుస్తుంది. ప్రస్తుతం హెచ్‌పీవీ టీకాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.2 వేల నుంచి రూ.10 వేల ధరలో టీకాలు అందుబాటులో ఉన్నాయి. 9-15 ఏళ్ల పిల్లలకు ఒక డోసు వేయించినా చాలని వైద్యులు చెబుతున్నారు. ఫలితంగా 20 ఏళ్ల తర్వాత ఆ క్యాన్సర్ కేసులు తగ్గించగలమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

2022లో దేశవ్యాప్తంగా నమోదైన కేసులు..

1,27,526	గర్భాశయ ముఖద్వారం
రొమ్ము క్యాన్సర్	1,92,020

- ప్రస్తుతం దేశంలో 14.13 లక్షల క్యాన్సర్ కేసులున్నాయి. ఐసీఎంఆర్-నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్‌ఫర్మేటిక్స్ అండ్ రీసెర్చ్ చేసిన అధ్యయనం ప్రకారం 2045 నాటికి వాటి సంఖ్య 24.56 లక్షలు దాటుతుందని అంచనా.

రోజుకో కేసు: నగరంలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో రోజుకు ఒక రొమ్ము క్యాన్సర్ కేసు వస్తుంది. అందులో తొలి దశలో వస్తున్నవారు చాలా తక్కువ. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు వారానికి కనీసం 10 వస్తుంటాయి. 'ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ సోకిన భాగం వరకే తొలగిస్తారు. తీవ్రత పెరిగితే రొమ్ము మొత్తం తొలగించాల్సిన పరిస్థితి వస్తుంది. కుటుంబంలో ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ వస్తే ఆ ఇంట్లో అమ్మాయిలు 20 ఏళ్ల దాటగానే తరచూ పరీక్షలు చేయించుకోవాలి' అని వైద్యులు చెబుతున్నారు.

స్పందన తక్కువే...


కేజీహెచ్‌లో అక్టోబరు, నవంబరు నెలల్లో 40 ఏళ్లు దాటిన కనీసం 15 మంది మహిళలకు ప్రతి రోజూ ఉచితంగా మామోగ్రామ్ పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు వస్తే ప్రస్తుతం ఆరు నుంచి ఏడుగురు వస్తున్నారు. గతంలో కంటే సంఖ్య పెరిగినా అనుకున్న స్థాయిలో స్పందన లేదని వైద్యులు చెబుతున్నారు. 'మామోగ్రామ్ పరీక్షలకు మహిళలు వెనకడుగు వేస్తున్నారు. కేజీహెచ్‌లో నిత్యం ఉచితంగా పరీక్షలు చేస్తాం. స్క్రీనింగ్ చేయించుకుంటే తొలిదశలో గుర్తించవచ్చు' అని మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప తెలిపారు.

ఆ పిలుపు.. ముంచే వలపు!

మురళీనగర్ నుంచే 'హనీట్రాప్'

విశాఖ కేంద్రంగా సైబర్ మోసాలు!!

ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే, మాధవధార





రాష్ట్రంలో జరిగే సైబర్ మోసాల్లో బాధితులు ఎక్కువ మంది విశాఖ వాసులే. విశాఖ కేంద్రంగా సైబర్ నేరగాళ్ల మోసాలకు తెగబడటం, ఇతర దేశాల్లోని ముఠాలతో కలిసి ఇక్కడే కేంద్రాలు ఏర్పాటు చేయడం కలవరపెడుతోంది. నెల రోజుల వ్యవధిలో వెలుగులోకి వచ్చిన పలు మోసాల తీరు తెలిసి నగరవాసులు ఉలిక్కిపడుతున్నారు.

హనీట్రాప్ కేసు ఆమెతో సరి: మురళీనగర్ కేంద్రంగా జాయ్ జమీయా అనే యువతి హనీట్రాప్(ప్రేమ పేరుతో వలలో వేసుకోవడం)కు తెరలేపింది. ఆమె బాధితులు ఇటీవల ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. ఓ ఎన్ఆర్ఐ ఫిర్యాదుతో ఈ నెల 4న భీమిలి స్టేషన్ పోలీసులు యువతిని అదుపులోకి తీసుకుని విచారించారు. 5న కోర్టుకు హాజరుపర్చి రిమాండ్‌కు పంపారు. 9వ తేదీన భీమునిపట్నం స్టేషన్‌కు జ్యుడిషియల్ కస్టడీకి తీసుకుని ఏసీపీ అప్పలరాజు విచారణ చేశారు. ఈ క్రమంలో బాధితులు ముందుకొచ్చి కంచరపాలెం, ఎయిర్‌పోర్టు స్టేషన్లలోనూ జమీయాపై కేసులు పెట్టారు. తెలుగు రాష్ట్రాల్లో ఈమె బాధితులున్నారు. ఎలా వలలో వేసుకోవాలి? మత్తు ఎలా ప్రయోగించాలి? వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ ఎలా చేయాలి? అనే అంశంపై ఓ ముఠా శిక్షణ ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ముఠాను అదుపులోకి తీసుకోలేదు.

ఓ ఫారెస్ట్ అధికారి హడావుడి: ఈ ముఠాలో ఓ ఫారెస్ట్ అధికారి హస్తం ఉన్నట్లు సమాచారం. హనీట్రాప్ చేస్తున్న జమీయా ఖాతా నుంచి ఆ అధికారి ఖాతాకు నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించి, సదరు అధికారిని పిలిపించి గోప్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. విచిత్రమేమంటే ఆమెను అరెస్టు చేసిన సమయంలో ఆ అధికారి పోలీసులకు ఫోన్ చేసి హడావుడి చేసినట్లు తెలుస్తోంది. 'జమీయా నాకు బంధువు అవుతుంది. కేసు ఎలా పెడతారు? ఎలా అరెస్టు చేస్తారు?' అంటూ పోలీసులనే హెచ్చరించడంతో అనుమానం వచ్చి ఆయన బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు, ఫోన్ కాల్స్‌పై దృష్టి పెట్టినట్లు చర్చ జరుగుతోంది.



నగరంలోనే ఉంటూ..

▲ సెప్టెంబరు 28న దిల్లీలో నమోదైన కేసులో భాగంగా ఎండాడ, మురళీనగర్‌లో ఉంటూ కాల్ సెంటర్లు నిర్వహిస్తున్న తొమ్మిది మందిని సీబీఐ అరెస్టు చేసింది. నిరుద్యోగులే లక్ష్యంగా వీరు సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

▲ చైనా, తైవాన్‌లోని సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ విశాఖ కేంద్రంగా కాస్మెటిక్స్ అమ్మకాల పేరుతో బెట్టింగ్ యాప్‌లు, టాస్క్ గేమ్‌లు, ఫెడెక్స్ కొరియర్ నిర్వహిస్తున్న ఏడుగురితో కూడిన ముఠాను 17న అరెస్టు చేశారు. అహ్మదాబాద్ నిఘా విభాగం నుంచి విశాఖకు సమాచారం వచ్చింది. విశాలాక్షినగర్, ఏఎన్‌బీచ్ సమీపంలోని ఫ్లాట్లు అద్దెకు తీసుకుని సైబర్ మోసాలకు పాల్పడుతూ...బ్యాంకు ఖాతాలు సేకరించి సొమ్ము కాజేసి చైనా, తైవాన్‌కు నగదు బదిలీ చేస్తున్నట్లు గుర్తించారు.


▲ రాష్ట్రానికి చెందిన నిరుద్యోగ యువతే లక్ష్యంగా నకిలీ ఐడీలతో బ్యాంకు ఖాతాలు తెరిచి వారి నుంచి డబ్బులు కాజేస్తున్న నలుగురు ముఠా సభ్యులను శుక్రవారం అరెస్టు చేశారు. 17 రాష్ట్రాల్లో 50 సైబర్ నేరాల ఫిర్యాదులు అందగా, రూ.40 కోట్ల లావాదేవీలు ఈ ముఠా జరిపినట్లు గుర్తించారు.

నేడు, రేపు డైవర్స్/విడో/విడోవర్(అన్ని కులాలు)లకు..

'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' డైవర్స్/విడో/విడోవర్‌లకు ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విశాఖపట్నం అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలో 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, అక్టోబరు 19న), రేపు (ఆదివారం, అక్టోబరు 20న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 91549 18858, 80080 01686 ఫోన్‌నెంబర్ల ద్వారాగానీ, యాప్‌ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపించవచ్చు. - న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

విశాఖ ఆర్ఎంగా అప్పలనాయుడు



కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం ఇన్‌ఛార్జి రీజనల్ మేనేజర్‌గా బి.అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖ ఆర్ఎంగా విధులు నిర్వహించిన ఎ.అప్పలరాజు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన అప్పలనాయుడు మాట్లాడుతూ విశాఖలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని, ఆర్టీసీ సేవలు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. నగరంలో ఆయన డిపో మేనేజరు, మెకానికల్ ఇంజినీరు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన అనుభవం ఉంది.

రెస్టారెంట్లు, హోటళ్లకు రాత్రి 12 వరకు అనుమతులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని హోటళ్లకు, రెస్టారెంట్లకు, ఇతర తినుబండారాల దుకాణాలకు అర్ధరాత్రి 12 గంటల వరకు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుమతులు ఇస్తున్నట్లు సీపీ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లకు మాత్రం ఇది వర్తించదన్నారు.

స్థాయిలో అంశాలపై.. సుదీర్ఘ చర్చ



స్థాయీ సంఘం సమావేశంలో పాల్గొన్న సభ్యులు, ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన స్థాయీ సంఘం సమావేశంలో సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. అజెండాలో ఇప్పటికే ప్రతిపాదించిన రెండు అంశాలతోపాటు, పౌరపాటున పొందుపరచిన మరో అంశాన్ని తొలగించినట్లు కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం వాహనాలను గుత్తకు ఇవ్వడానికి మెకానికల్ విభాగం ఇంజినీరు దిలీప్ ప్రతిపాదించగా, వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకు ప్రతిపాదించడం సరికాదని, ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే వరకు మార్చి 31 వరకు మాత్రమే టెండర్లు పిలవాలని సభ్యులు సూచించారు. ప్రతిపాదిత నిధులను సవరణ చేయాలని సూచించారు. కేజీహెచ్‌లో 25 మంది మలేరియా వర్కర్లను ఏర్పాటు చేయడంపై సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డుకు ఇద్దరు నుంచి ముగ్గురు కార్మికులుంటే, కేజీహెచ్, జీజీహెచ్‌లలో 25 మందిని ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. వారి వివరాలు, బ్యాంకు అకౌంట్లు సమర్పించాలని సభ్యులు కోరారు. ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించగా, రూ.1,04,167 నిధులు చెల్లించే అంశానికి సంబంధించి వివరణ ఇవ్వడానికి ప్రణాళిక విభాగం సిబ్బంది, అధికారులెవరూ సమావేశానికి హాజరు కాకపోవడంపై మేయరు, ఛైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శి సిబ్బంది ద్వారా అధికారులకు సమాచారం ఇవ్వగా, డీసీపీ రామలింగేశ్వరరెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ఆయన కూడా సక్రమంగా సమాధానం చెప్పలేకపోవడంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు. మలేరియా కార్మికుల కొనసాగింపు, వాహనాల నిర్వహణ టెండర్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. స్థాయీ సభ్యులు గల్లా చిన్నా, శరగడం రాజశేఖర్, పిల్లా మంగమ్మ, పులి లక్ష్మీబాయి, నొల్లి నూకరత్న, విల్లూరి భాస్కరరావు, పిసిని వరహ నరసింహం, గొలగాని వీరారావు, బల్ల శ్రీను, బొమ్మిడి రమణ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను మోసగిస్తున్న ముఠా గుట్టురట్టు

ఎండాడ, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని ఉద్యోగాల ఆశ చూపి మోసగిస్తున్న ముఠా సభ్యులను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వీరిలో బొండా వెంకట శివసాయికృష్ణ, ముడికి యాదేశ్ కుమార్, సిర్రా ప్రదీప్ కుమార్, సింగంశెట్టి సాయిబాబా ఉన్నారు. వీరు మరి కొంత మందితో కలిసి తెలుగు రాష్ట్రాలతో పాటు మరికొన్ని ఇతర రాష్ట్రాల్లోనూ ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై 17 రాష్ట్రాల్లో 50కు పైగా సైబర్ నేరాలు నమోదై ఉన్నాయి. సుమారు రూ.40 కోట్ల మేర నష్టపోయినట్లు సంబంధిత బాధితుల నుంచి ఫిర్యాదులున్నాయి. వీరు ఫేక్ ఐడీలతో బ్యాంక్ ఖాతాలు తెరిచి, నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తాల్లో ఆయా ఖాతాలకు డబ్బులు జమ చేయాలని చెబుతున్నారు. వారి వలలో పడిన వారంతా ఆయా ఖాతాలకు డబ్బులు పంపి, తర్వాత మోసపోయినట్లు తెలుసుకుని పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం పోలీసులు పేర్కొన్నారు.

మాలధారణ భక్తులకు నిర్విరామ భిక్ష

నేటి నుంచి నిత్యం వేలాది మందికి అన్న ప్రసాదం


సంఘం సభ్యులు


భిక్ష చేస్తున్న భక్తులు(పాతచిత్రం)

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నగరంలోని పోర్టు ఆసుపత్రి ఎదురు ఖాళీ స్థలంలో 'యెరిమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు' ఆధ్వర్యంలో నేటి నుంచి 45 రోజులపాటు మాలధారణ భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుంది. గత 14 ఏళ్లుగా 11మంది సంఘంగా ఏర్పడి వేలాదిమంది మాలధారణ భక్తులకు 'భిక్ష' ఏర్పాటు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వారి పనులపై నగరానికి వచ్చే భక్తులకు, ఇంట్లో, పీఠంలో వీలుకాని భక్తులకు ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు ఇక్కడ అన్న ప్రసాదం దొరుకుతుంది.

★ ప్రతీరోజూ 13 రకాల వంటకాలుంటాయి. ఒక మిఠాయి, బిరియానీ, పులిహోర, రెండు కూరలు, అన్నం, సాంబారు, పచ్చడి, పెరుగు, అప్పడాలు తదితర వాటితో కమ్మని ఆహారం లభిస్తుంది. ★ రోజుకి రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇదంతా దాతలు సాయం చేస్తుండడంతో నిరాటకంగా కొనసాగుతోంది.

★ మాల ధరించిన పేదలు ఎవరైనా ఉంటే వారిని శబరిమల పంపించడానికి అవసరమైన ఖర్చుల్నీ సంఘం తరఫున భరిస్తుంటారు. భిక్ష ఆఖరి రోజున డిసెంబరు 2 రాత్రి పడిపూజ నిర్వహిస్తారు.

★ 16 ఏళ్లపాటు శబరిమలలో అన్నదానం: సంఘం తరఫున 16 ఏళ్ల పాటు 2010 వరకు శబరిమలలో రోజుకి 50 వేల భక్తులకు అన్న సమారాధన చేసేవారు. నగరం నుంచి బియ్యం, పప్పులు, కూరగాయలు వగైరా అన్నీ రైలులో శబరిమలకు తీసుకెళ్లి అక్కడ వారంరోజుల పాటు మాలధారణ భక్తులకు భిక్ష ఏర్పాటు చేసేవారు. పులిమేడ్‌లో అగ్నిప్రమాదం జరగడంతో అక్కడి ప్రభుత్వం అన్నసమారాధన చేయకూడదంటూ నియమం విధించింది. అప్పట్నుంచీ విశాఖ నగరంలోనే నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో కాస్త ఆటంకం ఏర్పడింది.

పర్యాటక స్పీడు బోట్ల పునరుద్ధరణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో విన్యసించే పర్యాటక స్పీడు బోట్లను శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలించక ఇక్కడి తీరంలోని టూరిజం స్పీడు బోటు కంట్రోల్ రూం పర్యవేక్షణలో నడిచే స్పీడు పడవల్ని ఈ నెల 14వతేదీ నుంచి ముందు జాగ్రత్త చర్యగా నిలిపివేశారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంతో యథావిధిగా వీటిని నడుపుతున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

బెటాలియన్ పోలీసులకు వైద్య పరీక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కేజీహెచ్‌లో శుక్రవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బెటాలియన్ ఎస్పీ కె.వి.మురళీకృష్ణ విజ్ఞప్తి మేరకు వైద్య శిబిరాన్ని కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ వి.శివానంద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆసుపత్రి వైద్యాధికారులు అందిస్తున్న సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని బెటాలియన్ పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ శివానంద మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరపనున్న ఈ శిబిరంలో వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేయనున్నామన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్పీ బెటాలియన్ ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, చిత్రంలో కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ వి.శివానంద తదితరులు

వైద్య పరీక్షల్ని వ్యతిరేకిస్తున్న కార్మికులు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కులో 50 ఏళ్ల వయసు పైబడిన సుమారు 3,150 మంది ఒప్పంద కార్మికులకు శుక్రవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దీనిపై ఒప్పంద కార్మిక సంఘాల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. కార్మికుల్ని విధుల నుంచి తొలగించేందుకే కేంద్రం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. వెంటనే వైద్యపరీక్షలు నిలిపివేయకపోతే... ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ★ అయితే వైద్య పరీక్షల నిర్వహణపై ఉక్కు జీఎం(హెచ్ఆర్) మాట్లాడుతూ... కార్మికుల ఆరోగ్యానికి సంబంధించి మాత్రమే వైద్య పరీక్షలు చేయిస్తున్నామన్నారు.

5 గంటలు ఆలస్యంగా బెంగళూరు రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింక్ రైలు అందుబాటులో లేకపోవడంతో ఈనెల 18వ తేదీ ఉదయం 10.35 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-హావ్‌డా(12864) రైలు 5.55 గంటలు ఆలస్యంగా బయలుదేరేలా మార్పు చేశారు.

నిపుణుల సూచనలతో పకడ్బందీగా ప్రణాళిక

'విశాఖ గ్రోత్ హబ్ ప్రాజెక్టు'పై నీతిఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ సమీప జిల్లాల అభివృద్ధికి రూపొందిస్తున్న ప్రణాళికలపై నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం సమీక్షించారు. ఆయా జిల్లాల్లో ఏ రంగాలను కొత్తగా గుర్తించి వృద్ధిలో భాగస్వామ్యం చేయొచ్చో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు రూపొందించిన ప్రణాళికల స్థితిగతులపై చర్చించారు. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సమావేశం మందిరంలో శుక్రవారం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలోని 'విశాఖ గ్రోత్ హబ్ ప్రాజెక్టు' రూపకల్పనపై పలు జిల్లాల కలెక్టర్లు, కమిటీ సభ్యులు ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. విశాఖ, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఉన్న అవకాశాలు, సహజవనరుల లభ్యత, సేవా రంగాల పరిస్థితి, వ్యవసాయ, ఆహార సంబంధ పరిశ్రమల స్థితి వాటి అనుబంధ, ప్రతిభా అంశాలపై చర్చించారు. ఆయా జిల్లాల్లో ఏ రంగాలను ప్రోత్సహిస్తే ఏవిధమైన అభివృద్ధి జరుగుతుందో అధికారులు తెలియజేశారు. ఆయా అంశాలపై సంబంధిత రంగాల నిపుణులతో చర్చించి నవంబరు నాటి కల్లా ఒక విధానం రూపొందించాలని సీఈవో సూచించారు. వారణాశి, ముంబయి, సూరత్ ప్రాంతీయ ప్రణాళికల రూపకల్పన చివరి దశలో ఉన్నాయని, విశాఖది మాత్రం మధ్య దశలోనే ఉందన్నారు. జనవరి నాటి కల్లా దీనికి తుది రూపు తీసుకురావాల్సి ఉందని స్పష్టం చేశారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, దినేశ్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖవ్యాలీ పాఠశాలకు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ ఈశ్వరీ ప్రభాకర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ గ్రాండ్ జ్యూరీ 2024-25 జాతీయ అవార్డును విశాఖవ్యాలీ స్కూలు సొంతం చేసుకుంది. సీబీఎస్‌ఈ పాఠశాలలకు సంబంధించి.. నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కారం, చదువుల్లో మెలకువల తదితర అంశాలతో విద్యారంగ నిపుణుల దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ద్వారా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరీ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో మూడు విభాగాల్లో విశాఖవ్యాలీ పాఠశాలకు ప్రథమ ర్యాంకు వచ్చిందన్నారు. అలాగే ప్రిన్సిపాళ్ల విభాగంలో ఈమె నాయకత్వ లక్షణాలకు ప్రత్యేక అవార్డు వచ్చిందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఇతర అధికారులు అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ మొదటి యూనిట్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో విద్యుదుత్పత్తి పునఃప్రారంభించారు. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో బాయిలర్ ట్యూబుల లీకేజీలు ఏర్పడడంతో బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో సంస్థ అధికారులు విద్యుదుత్పత్తిని నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. సంస్థ ఉద్యోగులు, కార్మికులు శ్రమించి బాయిలర్ ట్యూబుల లీకేజీలకు మరమ్మతులు పూర్తి చేసి ఉత్పత్తిని పునఃప్రారంభించారు. ప్రస్తుతం 1, 2, 3, 4 యూనిట్లలో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతోంది.

పెందుర్తి

అ వీ ఇ వీ


సింహగిరి మాడవీధుల్లో ఊరేగింపు

వైభవంగా తులా సంక్రమణ తిరువీధి

సింహాచలం, న్యూస్‌టుడే: తులా సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి తిరువీధి ఉత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. వంశీకులు వేద పారాయణాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తులను సింహగిరి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు తిరువీధులలో స్వామిని దర్శించుకుని గోవింద నామ స్మరణ చేశారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం శుక్రవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ బేడా మండపంలోని వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పీఎంశ్రీ హైస్కూళ్లు ఉన్నత శ్రేణిలో రాణింపు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకంలో ఎంపికైన సిలబస్‌తో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలలు రానున్న కాలంలో అన్నిరకాల హంగులతో ఉత్తమమైన విద్యాసంస్థలుగా అభివృద్ధి చెందుతాయని భీమిలి డైట్ కళాశాల ప్రధానాచార్యులు ఎం.జ్యోతికుమారి పేర్కొన్నారు. పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు భీమిలి డైట్ కళాశాల ప్రాంగణంలో సమగ్ర శిక్షా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ అంశాల్లో జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. నాలుగు విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో వక్తృత్వ పోటీలో పెందుర్తి ప్రభుత్వ హైస్కూలు(విస్సన్నపేట), ఆర్.వి.పురం జెడ్పీ హైస్కూలు(వెస్ట్) నిలిచాయి. డిజిటల్ క్విజ్ పోటీలో పెందుర్తి జెడ్పీ హైస్కూలు(విస్సన్నపేట), ఆనందపురం జెడ్పీ హైస్కూలు(వెస్ట్), క్విజ్ పోటీలో ఆనందపురం జెడ్పీ హైస్కూలు(వెస్ట్), చిట్టివలస జెడ్పీ హైస్కూలు(ఈస్ట్), డిస్కవర్, లెర్నింగ్ లోకల్ సైన్స్ పోటీలో చిట్టివలస జెడ్పీ హైస్కూలు(వెస్ట్), పెందుర్తి ప్రభుత్వ హైస్కూలు(విస్సన్నపేట) నిలిచాయి. జిల్లాస్థాయిలో ఎంపికైన ఈ విజేత పాఠశాలలు ఈనెల 21 నుంచి 23 తేదీల మధ్య విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని సమగ్రశిక్షా పథకం ఏఎంవో మోనటరింగ్ అధికారి జి.లక్ష్మి పేర్కొన్నారు.

గృహ రుణాలు మంజూరు చేయండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పట్టణ పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని, ముఖ్యంగా టిడ్కో ఇళ్లకు సంబంధించి రుణాలివ్వాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి కోరారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో యూసీడీ పీడీ సత్యవేణితో కలిసి బ్యాంకర్లతో సమావేశమయ్యారు. మహిళా సంఘాల రుణాలు, మహిళల స్వయం ఉపాధి అంశాలపైనా చర్చించారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని పీడీ సత్యవేణి పేర్కొన్నారు.

వేట సాగక.. పూట గడవక..

వరుస వాయు గుండాలు, తుపానులతో మత్స్యకారుల అవస్థలు


ముత్యాలమ్మపాలెంలో తీరానికే పరిమితమైన బోట్లు

పరవాడ, న్యూస్‌టుడే

కడలిని నమ్ముకుని బతుకు నావను నెట్టుకొస్తున్న గంగపుత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సముద్రం ప్రశాంతంగా ఉంటేనే వేటకు వెళ్లేది.. కుటుంబం సాగేది.. లేకుంటే పస్తులుండాల్సిందే. చేపలవేట నిషేధం అనంతరం జూన్ 14 నుంచి వేట పునఃప్రారంభమైనప్పటి నుంచి వీరికి ఏ మాత్రం కలిసి రావడం లేదు. సముద్ర కాలుష్యం కారణంగా వలలకు సరిగా చేపలు చిక్కక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులకు వరుస వాయుగుండాలు, తుపానులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. తుపాను హెచ్చరికలతో వారాల తరబడి ఇంటికే పరిమితమవుతున్నారు. చేపల వేట తప్ప మరో వృత్తి తెలియని మత్స్యకారులు గత్యంతరం లేక అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

గత ప్రభుత్వం హామీలు ఇచ్చి విస్మరించడంతో..

పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పంచాయతీ మత్స్యకార గ్రామం. ఇందులో దిబ్బపాలెం, జాలారిపేట శివారు పల్లెలు ఉన్నాయి. ఇక్కడ 8 వేలకు పైగా ఉన్న జనాభాకు చేపల వేటే ప్రధాన ఆధారం. వైకాపా ప్రభుత్వంలో చాలావరకు వీరికి రాయితీ పథకాలు అందలేదు. తీరంలో జెట్టీ నిర్మిస్తామని, వసతులు కల్పించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని వైకాపా ప్రభుత్వం గతంలో ప్రకటించినా అవి ఏమాత్రం కార్యరూపం దాల్చలేదు. ఈ ఏడాది వేట నిషేధ పరిహారం అందక ఇక్కట్లు పడుతున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం(2014-19) హయాంలో రాయితీపై ఇచ్చిన వలలు, ఐస్‌బాక్స్‌లు, మోటారు సైకిళ్లు, ఇంజిన్లు, బోట్లతోనే ఇప్పటికీ నెట్టుకొస్తున్నామని వారంతా చెబుతున్నారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ వ్యర్థ జలాలు తీరంలో కలవడం వల్ల మత్స్య సంపద నశించి వేట సాగడం లేదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ సైతం భారంగా మారిందని చెబుతున్నారు. ఫార్మాసిటీలో 500, ఎన్టీపీసీలో 60 ఉద్యోగాలు కల్పిస్తామని జిల్లా ఉన్నతాధికారులు గతంలో ఒప్పందం చేసినా ఇప్పటికే వాటిని అమలు చేయలేదని వాపోతున్నారు. తీరంలో జెట్టీ లేకపోవడంతో బోట్లు, సామగ్రికి రక్షణ లేకుండా పోయింది. వేటకు వెళ్లే ప్రతిసారి బోట్లు, వలలు, ఇంజిన్లను సముద్రంలోకి కర్రలతో మోసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జెట్టీ నిర్మించి కష్టాలు తీర్చాలి..



జెట్టీ లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. బోట్లు మోయలేక వెన్నునొప్పి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. రాయితీ పథకాలు అందడం లేదు. తుపానుల సమయంలో బోట్లు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. వరస తుపానులతో ఈ ఏడాది అసలు చేపల వేట కలిసి రాలేదు. కుటుంబ జీవనం కష్టంగా మారింది. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలి.
– మేరుగు కొర్లయ్య, మత్స్యకారుడు, ముత్యాలమ్మపాలెం


వలలకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

అప్పులు పాలవుతున్నాం..



తుపానులు, వాయుగుండాలతో వేట లేక ఇంటిపట్టునే ఉంటున్నాం. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఇంధనం, మరమ్మతుల ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ఈ ఏడాది వేట నిషేధ పరిహారం కూడా అందలేదు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీలో ఇస్తామని చెప్పిన ఉద్యోగాలు కూడా ఇప్పటివరకు ఇవ్వలేదు. తమకు కంపెనీల్లో ఉపాధి కల్పించి న్యాయం చేయాలి.
– తిత్తి దేముడు, మత్స్యకారుడు, ముత్యాలమ్మపాలెం

మునగలో మేలైన పోషకాలు

సరిపల్లి(పెందుర్తి), న్యూస్‌టుడే: మునగతో మహిళలు, చిన్నారులకు మేలైన పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ పీడీ జయదేవి పేర్కొన్నారు. సామాజిక వేడుకలో భాగంగా శుక్రవారం పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'మునగచెట్టు మహిళల ఆరోగ్యానికి తొలిమెట్టు' కార్యక్రమం నిర్వహించారు. జయదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మునగలోని పోషకాలను మహిళలకు వివరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద మునగ చెట్టు పెంచాలని సూచించారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారిణి శారద, పెందుర్తి సీడీపీవో నీలవేణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు డి.మానస, ఎంఎస్‌కే ఉష, అంగన్‌వాడీ కార్యకర్త ఎల్.రామలక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ పీడీ జయదేవి, తదితరులు

శ్రీనివాసుడికి స్నపన తిరుమంజనం

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం వైభవోపేతంగా జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. వేద మంత్రోచ్చారణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, ఫలోదకాలతో శ్రీనివాసుడికి స్నపన తిరుమంజనం సంప్రదాయబద్ధంగా జరిపించారు. నూతన వస్త్రాలు అలంకరించి ధూపదీప సేవలతో కొలిచారు. భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


శ్రీవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకుడు

ఏపీసీ మృతి బాధాకరం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటరు(ఏపీసీ)గా సేవలందించిన బి.శ్రీనివాసరావు మృతి చాలా బాధాకరమని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం జిల్లా డీపీఓగా బదిలీపై వెళ్లి గురువారం ఆయన గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీనివాసరావు మృతి పట్ల శుక్రవారం కలెక్టరేట్ జరిగిన సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఇతర అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు.

విశ్లేషించి.. ప్రతిభ చూపించి..



వ్యాసరచన పోటీలో పాల్గొన్న చినముషిడివాడ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు, విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ పి.రాజేశ్వరి, ఉపాధ్యాయులు

'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం చినముషిడివాడ, సుజాతనగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిపారు. ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ★ చినముషిడివాడ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు జి.శ్రావణి, ఆర్.షర్మిల, పి.అఖిల్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ పి.రాజేశ్వరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ★ సుజాతనగర్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో జి.దీపిక, సీహెచ్.యశ్వ ప్రదీప్‌సాయి, ఎంవీ.సొహైల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయిని ఎన్.రమాదేవి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, పెందుర్తి



సుజాతనగర్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో..; గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసిన ప్రధానోపాధ్యాయిని రమాదేవి, ఉపాధ్యాయులు

ఆధునిక సాంకేతికతతో మెరుగైన ఉపాధి అవకాశాలు



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్సు (డీఎస్) తదితర సాంకేతికతలతో భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏఐసీటీఈ-వైబ్రెంట్ ఎడ్వకసీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (వాణి) సహకారంతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఏఐ, ఎం.ఎల్, డి.ఎస్'పై తెలుగులో నిర్వహించిన చర్చా వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ 2026 నాటికి వీటి అనువర్తనాలను 75 శాతం పైగా వినియోగిస్తారన్నారు. లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టించే శక్తి వీటికి ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దేశ, విదేశీ నిపుణులతో ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు నూతన సాంకేతికతలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీఎస్ఈ విభాగం ఆచార్యులు ఆచార్య ఎం.శశి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే వీటిని బోధించాల్సిన అవసరముందన్నారు. ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతికతను స్థానిక భాషతో అనుసంధానించడంతో మెరుగైన అవగాహన కలుగుతుందన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, చర్చా వేదిక సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ తదితరులు మాట్లాడారు. అనంతరం అమెరికా నుంచి ఏఐ సాంకేతిక భవిష్యత్తు అంశంపై సునీల్ ఎస్ రంక, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ రవి ఈశ్వరపు, న్యూరల్ నెట్ వర్క్స్‌పై విజయ్ ప్రసంగించారు. కార్యక్రమం తెలుగులో నిర్వహించడంతో ఆచార్యులు తెలుగులో ఉపన్యాసం చేసేందుకు ఇబ్బందులు పడ్డారు.

ప్రణాళికతో మోనోపాజ్‌ను ఎదుర్కోవచ్చు

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: మహిళలు మోనోపాజ్ దశ నుంచి భయపడకుండా ప్రణాళికతో ఎదుర్కోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మానస సూచించారు. పెందుర్తి ఐసీడీఎస్, వాసవ్య మహిళా మండలి, విప్రోకేర్ కుశల్ మెటర్నిటీ హెల్త్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పాపయ్యరాజుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మోనోపాజ్, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ ఆహార అలవాట్లు, జీవన శైలి మార్పుల ద్వారా మహిళలు ఆయా సమస్యలను అధిగమించవచ్చునన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.లక్ష్మి, మహిళా పోలీసు రత్నం, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్త రమణి, అంగన్‌వాడీ కార్యకర్త బి.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న నిర్వాహకులు, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది

చురుగ్గా ఆలయ అభివృద్ధి పనులు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట పరిసర 14 గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం నర్సింగ బిల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి గర్భగుడి చుట్టూ ఖాళీ ప్రదేశంలో స్లాబు నిర్మాణం చేశారు. కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో గ్రామపెద్దలు ముత్తానాయుడు, మాజీ సర్పంచి బల్ల రాంబాబు, శేశెట్టి అప్పారావు, యర్రా నాగరాజు, మహేశ్, వాసురాజు తదితరులు దగ్గరుండి పనులు పూర్తి చేయించారు. దాతల సహాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేటర్ రాపర్తి కన్నా తెలిపారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా, ముత్తానాయుడు, బల్ల రాంబాబు తదితరులు

నేడు ఎమ్మెల్యే పంచకర్ల పర్యటన

పరవాడ, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలో శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించనున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రూ.కోటి వెచ్చించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, రావాడ, కలపాక, గొర్లెవానిపాలెం, ఈ.భోనంగి పంచాయతీల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

పల్లెలకు నిజమైన పండగ: ఎమ్మెల్యే


గుల్లేపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, స్థానిక నేతలు

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పల్లెలకు నిజమైన పండగొచ్చిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. సబ్బవరం మండలంలోని తవ్వవానిపాలెం, అమృతపురం, పెదగొల్లలపాలెం, బాట జంగాలపాలెం, అసకపల్లి, సబ్బవరం-1, 2, 3, సచివాలయాలు, బోదువలస, ఎల్లుప్పి మర్రిపాలెం, ఎల్లుప్పి గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జిల్లా డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, తహసీల్దారు బి.చిన్నికృష్ణ, నేతలు బోకం స్వామినాయుడు, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, పడాల వెంకటరమణ, పి.శ్రీను, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, ఉగ్గిన రాము, సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల రమణ, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలంలో జరుగుతున్న పల్లె పండగ - గ్రామ పంచాయతీల వారోత్సవాల్లో భాగంగా జెర్రిపోతులపాలెం గ్రామంలో రూ.22 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి సర్పంచి మడక అప్పలరాజు శుక్రవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఉప ఎంపీపీ మడక పార్వతి, పంచాయతీ కార్యదర్శి శివ, పీఆర్ ఏఈ లక్ష్మణరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


శంకుస్థాపనలో పాల్గొన్న జెర్రిపోతులపాలెం సర్పంచి మడక అప్పలరాజు, తదితరులు

ఆక్రమణలకు అడ్డుకట్ట

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరంలోని సర్వే నెంబరు 449-9లో 6.07 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంతమంది మొక్కలు నాటి ఆక్రమణలు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు సబ్బవరం ఆర్ఐ వీరయ్య తన సిబ్బందితో వెళ్లి ఆక్రమణలకు అడ్డుకట్ట వేశారు. ఆక్రమిత ప్రదేశంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

ఇరుకు దారి.. వాహనాలు భారీ



దర్పణం

మండల కేంద్రం పరవాడ నుంచి భరణికం వెళ్లే రహదారిలో ప్రయాణం భయంభయంగా మారింది. ఒకపక్క ఇరుకు రహదారి మరోపక్క భారీ కంటైనర్ లారీలు రాకపోకలు సాగించడంతో తప్పుకోవడానికి స్థలం కూడా సరిపోక వాహనచోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో పాటు చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వస్తున్నాయి. రహదారి అంచులు వెంబడి బెర్మలు కోతకు గురయ్యాయి. ఏమాత్రం అదుపుతప్పినా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని ద్విచక్ర వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. అనకాపల్లి, పరవాడ, భరణికం, వెంకటాపురం, తోటాడ, మునగపాక ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారి వెంబడి పొదలను తొలగించడంతో పాటు విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పరవాడ

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు ఇంధన సర్దుబాటు పేరుతో వసూలు చేస్తున్న ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ పెందుర్తి జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు పెందుర్తి విద్యుత్తు కార్యాలయం వద్ద ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని నినాదాలు చేశారు. తక్షణమే ఆయా ఛార్జీలను రద్దు చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అప్పలనాయుడు, ఈశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్తు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు


కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

మొరాయించిన లారీ.. నిలిచిన ట్రాఫిక్

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ పెట్రోలు బంకు కూడలికి సమీపంలో బొగ్గు లారీ మొరాయించింది. లంకెలపాలెం నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న బొగ్గు లారీ సరిగా పెట్రోలు బంకు కూడలికి వచ్చేసరికి భారీ లోడు కారణంగా టైర్లలో గాలిపోయి ఒకపక్కకి ఒరిగిపోయింది. అయితే సరిగా గాజువాక, అచ్యుతాపురం, పరవాడ, లంకెలపాలెం వెళ్లే కూడలి కావడంతో వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. లారీ మొరాయించిన కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి వీలుకాక అవస్థలు పడ్డారు.

తాగునీరు నేలపాలు

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడ బొంకులదిబ్బ వీధిలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పైపులైన్ నుంచి తాగునీరు వృథా అవుతోంది. పైపులైన్ లీకై గత కొద్దిరోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. విలువైన తాగునీరు నేలపాలవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటున్న రోడ్డుపైన నీరు పారడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.


పైపులైన్ నుంచి లీకు అవుతున్న నీరు

జీసీసీ సేవలు విస్తరిస్తాం..

జీవనోపాధికి దారి చూపుతాం

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, పెదవాల్తేరు



◆ అరకు కాఫీ, జీసీసీ ఉత్పత్తుల స్టాళ్లకు ఫ్రాంచైజీలిస్తాం
◆ 'ఈనాడు, ఈటీవీ'తో ఎండీ కల్పనాకుమారి

'అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. ప్రధాని మోదీ మన్‌కీబాత్‌లో ఈ కాఫీ గొప్పతనం ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు కూడా అరకు కాఫీ, తోటల విస్తరణపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో జీసీసీ సేవలు మరింత విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తున్నాం. వాటితో గిరిజనుల జీవనోపాధి మెరుగవుతుంది' అని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఎండీ కల్పనా కుమారి వెల్లడించారు. అటవీ ఉత్పత్తుల సేకరణ నుంచి వాటి బ్రాండింగ్, మార్కెటింగ్ వరకు తీసుకువస్తున్న మార్పుల గురించి 'ఈనాడు, ఈటీవీ'కి ఆమె వివరించారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

ఆకర్షణీయ ప్యాకింగ్‌లో: జీసీసీ లోగో నుంచి ప్యాకింగ్ వరకు ఆధునికత జోడించి మార్పులు చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకునేలా ఆకర్షణీయంగా జీసీసీ ఉత్పత్తుల ప్యాకింగ్ ఉండబోతోంది. ఈ మేరకు మార్కెటింగ్ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. త్వరలోనే సరికొత్త ప్యాకింగ్‌తో కాఫీ, తేనె, పసుపు, చింతపండు, సబ్బులు, షర్బత్, నన్నారి ఇలా 50 రకాలపైగా మా ఉత్పత్తులు మార్కెట్‌లోకొస్తాయి.

మరిన్ని రుచుల్లో కాఫీ: జీసీసీ నుంచి అరకు కాఫీ అమ్మకాలకు ఫ్రాంచైజీలు ఇవ్వనున్నాం. అన్నిచోట్లా ఒకేలా ఏర్పాటు చేసేలా ఓ నమూనాను తయారు చేస్తున్నాం. వీటి కోసం ముందుకొచ్చేవారికి అరకు కాఫీ తయారీపై శిక్షణ ఇస్తాం. ఇప్పటికే విశాఖతో పాటు రాష్ట్రంలోని ముఖ్య ప్రాంతాల నుంచి ఫ్రాంచైజీల కోసం చాలామంది సంప్రదిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌స్టెంట్, ఫిల్టర్ కాఫీలు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో మరిన్ని రుచుల్లో కాఫీని తీసుకువచ్చే విధంగా డికాషన్ కాఫీని తీసుకురావాలనే ఆలోచనతో ఉన్నాం. మార్కెటింగ్ కోసం పొరుగుసేవల ద్వారా సిబ్బందిని నియమించుకుంటాం.

స్థానికంగానే ప్రాసెసింగ్ యూనిట్లు: కాఫీ, ఇతర అటవీ ఉత్పత్తులు సేకరించి వాటిని శుద్ధి చేయడానికి, విలువ జోడించడానికి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నాం. ఇకపై స్థానికంగానే వాటిని ప్రాసెస్ చేయాలని నిర్ణయించాం. అనకాపల్లి సమీపంలో కొత్తగా కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయబోతున్నాం. వచ్చే ఐదేళ్లలో 8 వేల టన్నుల నుంచి 10 వేల టన్నుల సరుకు సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఈ ఏడాది నుంచే 2000 వేల టన్నుల సేకరణ మొదలుపెడుతున్నాం. కాఫీతో వివిధ ఉత్పత్తులను తయారు చేయాలనే ఆలోచనలో ఉంది. రంపచోడవరంలో ఇటీవల మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ పెట్టాం. ఈ నెలాఖరులోగా వినియోగంలోకి తెస్తాం. పసుపు పంటకు విలువ జోడించి మార్కెటింగ్ చేస్తాం.

పారదర్శకతకు పెద్దపీట

జీసీసీ ద్వారా ఏటా రూ. 500 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. కాబట్టే సిబ్బంది, ఉద్యోగుల్లో జవాబుదారీతనం లోపించడంతో కొన్నిచోట్ల అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని జీసీసీ లావాదేవీలు మొత్తం ఆన్‌లైన్ చేయనున్నాం. జీసీసీ సేల్ పాయింట్లలో కొన్నింటిని డిపోల ద్వారా భర్తీ చేస్తున్నాం. ఇదివరకు అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేశాం.

న్యాయవాదులకిచ్చిన హామీలు నెరవేరుస్తాం: లోకేశ్



ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో ఎంపీ శ్రీభరత్

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు న్యాయవాదులకిచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోగల నూతన భవన సముదాయంలోని న్యాయవాదుల సమావేశ మందిరాన్ని శుక్రవారం సాయంత్రం న్యాయవాదుల సంఘం ఆహ్వానం మేరకు సందర్శించారు. ఈసందర్భంగా సంఘం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ తెదేపాలోవున్న వారంతా చట్టాలను గౌరవిస్తారని, రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయవాదులకు ఆరోగ్యకార్డుల మంజూరు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యపథకాలతో అనుసంధానం చేస్తామని ప్రకటించారు. న్యాయవాదులకు ఇంటిస్థలాలు మంజూరు చేస్తామని, న్యాయవాదుల పరిరక్షణకు ప్రత్యేక రక్షణచట్టం తెచ్చేలా ఆలోచిస్తున్నామన్నారు. ప్రొఫెషనల్ టాక్సు రద్దుకు ప్రయత్నిస్తున్నామన్నారు. విశాఖ న్యాయవాదుల ఉద్యమ స్ఫూర్తితోనే భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు జరిగిందని కొనియాడారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విశాఖ న్యాయవాదుల ఉద్యమస్ఫూర్తికి ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. జిల్లా కోర్టులో అటెండర్ల జీతాలు సక్రమంగా అందటంలేదని, త్వరలో సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. వచ్చే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీకి కట్టుబడివున్నామని తెలిపారు. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జెవర సత్యనారాయణ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డి.నరేష్‌కుమార్, న్యాయవాదులు బల్లి రాజశేఖర్, నర్రా వెంకటరమణ, కె.పార్థసారథి, ఎం.శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న న్యాయవాదులు

మూర్ఛ వ్యాధికి అందుబాటులో వైద్యం



డాక్టర్ దేబాశిష్ చౌదరిని సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ సంగీతా రావత్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మూర్ఛ వ్యాధి నివారణకు ఆధునిక వైద్యం అందుబాటులో ఉందని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ రాజేష్ నాయర్(కెనడా) అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఇండియన్ అకాడమి ఆఫ్ న్యూరాలజీ(ఐఏఎన్) జాతీయ సదస్సులో భాగంగా గురువారం మూర్ఛ, తలనొప్పి, పుట్టుకతో వచ్చే నరాల వ్యాధులు, న్యూరాలజీ అప్‌డేట్స్‌పై వివిధ అంశాలపై చర్చ నిర్వహించారు. డాక్టర్ రాజేష్ నాయర్ మాట్లాడుతూ మూర్ఛ రోగుల్లో కొందరు ఒక్కోసారి ఆకస్మికంగా మృతి చెందుతారని దీనికి నిర్దిష్టమైన కారణాలంటూ ఏమీ లేవన్నారు. అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే అదుపు చేయవచ్చునన్నారు. ఐఏఎన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేబాశిష్ చౌదరి మైగ్రేన్ తలనొప్పి, కారణాలు, అందుబాటులో ఉన్న వైద్య పద్ధతులపై ప్రసంగించారు. డాక్టర్ అన్నా మాయ సర్(జర్మనీ), ఐఏఎన్ నిర్వాహక కమిటీ ఛైర్మన్ డాక్టర్ జి.బుచ్చిరాజు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎస్.గోపి, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కేవీ వెంకటేశ్వర్లు, డాక్టర్ సుష్మ, డాక్టర్ సంగీతారావత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై పరిశోధనా పత్రాలను సదస్సులో పలువురు సమర్పించారు.

పారిశ్రామిక రంగంలో నైపుణ్యాలను పెంపొందించాలి





సమావేశంలో మాట్లాడుతున్న సీబీఐ ప్రతినిధి, పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు

మాధవధార, న్యూస్‌టుడే: పారిశ్రామిక రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఆయా పరిశ్రమల్లో ఉన్న పరికరాలు, వాటి వినియోగం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండేలా సిబ్బందికి సంబంధిత యాజమాన్యాలు తగు శిక్షణ ఇవ్వాలని సీబీఐ ఏపీ చైర్మన్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ వద్ద ఉన్న మారియట్ హోటల్లో శుక్రవారం సీబీఐ ఆధ్వర్యంలో ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్ (పీఎల్‌సీ)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమల్లో ఉత్పాదకత గణనీయంగా పెంచాలని, దానికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండటమే కాకుండా, వాటి వినియోగం పట్ల కార్మికులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. పరిశ్రమల్లో ఉత్పత్తి అభివృద్ధి చెందాలంటే ఆధునాతన యంత్రాలతో పాటు, సమయపాలన ఎంతో అవసరమని పలువురు ప్రతినిధులు పేర్కొన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పలువురు కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాకేత్, సిరామిక్స్, సిమెంటు, ఇతర పరిశ్రమల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. సీబీఐ ప్యానల్ కో-కన్వీనర్ ఎస్.నరేంద్రకుమార్, కార్యక్రమం శిక్షకుడు ఎం.కుమరన్ ముత్తు స్వామి, సీతారామరాజు, పలువురు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాశ్యాం రాథో, కెనరా బ్యాంకు ఆర్‌ఎం మధుసూదనరెడ్డి, రాజకీయ విశ్లేషకుడు రవికుమార్, ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు, ప్రముఖ కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ తల్లి షాలిని ఆలయానికి విచ్చేశారు. పండితులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈవో త్రినాథరావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



ఆర్‌బీఐ ఈడీ రాధాశ్యాం రాథోకు స్వామివారి ప్రసాదం అందిస్తున్న ఈవో త్రినాథరావు



కప్పస్తంభం వద్ద జూనియర్ ఎన్టీఆర్ తల్లి షాలిని

వరద బాధితులకు విరాళం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: వరద బాధితులకు తమ వంతు సహాయాన్ని అందించేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం టీచర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా రూ. 1,04,000 చెక్కును ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు అందించి ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ ఆచార్య ఎస్.ఆదిశేషు, ఆచార్య ఎన్.విజ్జులు, ఆచార్య ఆర్.మధుసూదన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.



ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న టీచర్స్ మ్యూచువల్స్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

అవినీతి జోలికి పోవద్దు



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర మత్స్యశాఖ డైరెక్టర్ (విజిలెన్స్) ఎస్.కె.జా, చిత్రంలో ఎఫ్‌ఎస్‌ఐ ఇన్‌ఛార్జి భామిరెడ్డి తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అవినీతిని పూర్తిస్థాయిలో నిర్మూలిద్దామని కేంద్ర మత్స్యశాఖ డైరెక్టర్(విజిలెన్స్) ఎస్.కె.జా పిలుపునిచ్చారు. చేపలరేవు సమీపంలోని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ(ఎఫ్‌ఎస్‌ఐ)లో శుక్రవారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులంతా సర్వీసు నిబంధనలను పక్కాగా పాటించాలని, విలువలను కొనసాగించి సుపరిపాలన అందించాలని సూచించారు. ఎఫ్‌ఎస్‌ఐ కేంద్రం ముఖ్య అధికారి డి.భామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మత్స్యశాఖ సంస్థలు సిఫ్‌నెట్, నిఫ్‌పాట్‌కు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'28న సమ్మెకు సహకరించం'

ఉక్కునగరం(స్టీల్‌ప్లాంట్-3), న్యూస్‌టుడే: జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 28న విశాఖ ఉక్కులో సమ్మె నిర్వహించేందుకు కొన్ని కార్మిక సంఘాలు సన్నాహాలు చేస్తున్నా...తాము మాత్రం సమ్మెకు సహకరించబోమని బీఎంఎస్, టీఎన్‌టీయూసీ-1,2, జనసేన, వీఎస్‌పీఈయూ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం వారు ఇదే అంశంపై సీజీఎం (పర్స్) యు.శ్రీధర్, సీజీఎం (హెచ్‌ఆర్) జె.గాంధీని కలిసి స్పష్టం చేశారు. ఉక్కు కర్మాగారం ఎదుర్కొంటున్న పెండింగ్, విద్యుత్తు ఛార్జీలు, వేతనాల చెల్లింపు వంటి అంశాలపై సమ్మె చేస్తేనే సహకరిస్తామన్నారు. సమావేశంలో కె.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు అధికారులతో సమావేశమైన కార్మిక నాయకులు

బాలికపై అసభ్యకర ప్రవర్తనకు జైలు, జరిమానా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నేరం రుజువు కావటంతో నిందితునికి ఐదు సంవత్సరాల జైలుశిక్షతోపాటు, ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పునిచ్చారు. ఫిర్యాదుపై సకాలంలో స్పందించని పాఠశాల ప్రధానోపాధ్యాయునికి ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు. పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన కేసు వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన నిందితుడు అలుగంటి పోచన్న(45) నగరంలో కూర్మన్నపాలెంలో వుంటూ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికుడుగా పనిచేసేవాడు. నిందితుడు పనిచేస్తున్న పాఠశాలలో బాధితురాలు(9) నాలుగో తరగతి చదివేది. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ సాయంత్రం పాఠశాలలో ఆడుకుంటున్న బాలిక వాష్‌రూము వద్దకు రావటంతో బాలికపట్ల నిందితుడు అసభ్యకరంగా ప్రర్తించటంతో కేకలు వేసింది. దీంతో నిందితుడు బాలికను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ఇదే విషయాన్ని బాధితురాలు ఇంట్లో తెలిపింది. దీంతో బాధితురాలి తండ్రి కె.ఈశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రాజేష్‌కి ఫిర్యాదుచేశారు. ప్రధానోపాధ్యాయుడు సకాలంలో స్పందించకపోవటంతో దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావటంతో నిందితులకు పైవిధంగా శిక్ష విధించారు.

భార్య మృతికి కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు, జరిమానా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: భర్త నిత్యం వేధింపులకు గురిచేయటం వలన జీవితంపై విరక్తితో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మృతికి కారణమైన భర్తకు ఏడేళ్ల జైలుశిక్షతోపాటు ఎనభై ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తూ ఆరో అదనపు జిల్లా న్యాయస్థానం కమ్ జిల్లా మహిళా సెషన్స్ న్యాయస్థానం న్యాయమూర్తి వి.శ్రీనివాస్ తీర్పునిచ్చారు. దీనికి అదనంగా నిందితుడు లక్ష రూపాయలు నష్టపరిహారాన్ని మృతురాలి తండ్రికి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్ అందించిన కేసు వివరాలిలా ఉన్నాయి. గోపాలపట్నం శివారు, యల్లపువానిపాలెం ప్రాంతానికి చెందిన నాగళ్ళ భోగిరాజు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో సబ్‌ఇన్స్‌పెక్టర్‌గా విశాఖలో విధులు నిర్వర్తిస్తున్నాడు. 2009 సంవత్సరం ఆగస్టునెల పన్నెండున నిందితునికి గాయత్రి అనే మహిళతో వివాహం జరిగింది. ఇరువురికి ఇది ద్వితీయ వివాహం. నిందితునికి మొదటి భార్య ద్వారా ఇరువురు సంతానం. దీంతో గర్భం దాల్చిన గాయత్రికి గర్భ విచ్ఛిన్నం చేయించి, అనంతరం సంతాన నిరోధక శస్త్రచికిత్స కూడా చేయించాడు. దీనికి తోడు అదనపు కట్నంతోపాటు ఆస్తిలో వాటాను కూడా తీసుకురమ్మని నిత్యం వేధించేవాడని ప్రాసిక్యూషన్ ఆరోపణ. ఈ నేపథ్యంలో గాయత్రి భర్త వేధింపులను తల్లిదండ్రులకు తెలియజేసింది. రాజీలు జరిగినా నిందితుడిలో మార్పు రాలేదు. ఈనేపథ్యంలో 2016 డిసెంబర్ రెండున నిందితుడు గాయత్రిని వేధించటంతో జీవితంపై విరక్తితో ఆమె అదే రోజు రాత్రి చీరతో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకుని మరణించింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు కేసును నమోదుచేసి నిందితుని న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావటంతో నిందితునికి పైవిధంగా తీర్పునిచ్చారు.

డిజిటల్ మార్కెటింగ్‌తో అధిక ప్రయోజనాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, ఇతర ఉత్పత్తిదారులు డిజిటల్ మార్కెటింగ్ విధానాలను అనుసరించి మరిన్ని ప్రయోజనాలను పొందాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ)లో అందరూ చేరాలన్నారు. జిల్లా పరిశ్రమలు, ఉత్పత్తుల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేందుకు వచ్చే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్ఫలితాలను సాధించాలన్నారు. పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ పి.శ్రీలేఖ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం వి.ఆదిశేషు, వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త అర్జునరావు కన్నుమూత



అర్జునరావు (పాతచిత్రం)

అక్కిరెడ్డిపాలెం (ఆటోనగర్), న్యూస్‌టుడే : పారిశ్రామికవేత్త, విద్యావేత్త పంపన అర్జునరావు (76) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆటోనగర్ సమీప తోకాడకు చెందిన శ్రీ లక్ష్మీప్రభ ఇంజినీరింగ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఏవీకే విద్యాసంస్థల అధినేతగా ఉన్న అర్జునరావు కొంత కాలంగా అనారోగ్యం బాధపడుతూ బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందారు. బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారని శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. ఆయనకు భార్య అనంతలక్ష్మి, కుమారుడు త్రినాథ్, కుమార్తె కమలేశ్వరి ఉన్నారు. ఆయన మృతికి పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు సంతాపం ప్రకటించారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలవాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను వారికి చేరువ చేయాలన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు జిల్లాలో నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. బాధితులకు నిర్ణీత కాల వ్యవధిలో నష్టపరిహారం చెల్లించాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో పౌరహక్కుల దినోత్సవాలను నిర్వహించాలన్నారు. ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు మాట్లాడుతూ హైకోర్టు స్టే ఉన్న కేసులపై కదలిక తెచ్చేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలను సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు వెల్లడించారు. సమావేశంలో సీపీ శంఖబ్రత బాగ్చీ, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీఓ శ్రీలేఖ, డీసీపీలు, ఏసీపీలు, విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, ఎమ్మెల్సీ రవీంద్రబాబు తదితరులు

దుకాణాల కోసం మద్యం వ్యాపారుల అగచాట్లు

మాధవధార, న్యూస్‌టుడే: లాటరీలో లైసెన్సులు దక్కించుకున్న వ్యాపారులు ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇంకా అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికిప్పుడు లైసెన్స్‌దారులకు అనుకూలమైన దుకాణాలు అద్దెకు లభించడం లేదు. ముఖ్యంగా విశాఖ నగరంలో భవనాలు, ఖాళీ జాగా లభించడం చాలాకష్టంగా ఉంది. నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా దుకాణాలు అందుబాటులో లేవు. యజమానులకు ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి తమ ఆధీనంలో ఉంచుకున్న మూతపడిన ప్రభుత్వ దుకాణాల్లో సిండికేట్లకు సంబంధించిన వారు సరుకు పెట్టి విక్రయాలు ప్రారంభించారు. విశాఖ జిల్లాలో మొత్తం 155 మద్యం దుకాణాల్లో మూడు రోజుల్లో 130 దుకాణాల వరకు తెరిచి విక్రయాలు ప్రారంభించారు.

★ నగర పరిధిలో మద్యం దుకాణం దక్కించుకున్న వారు ఏడాదికి రూ.85లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంది. అంటే ఒక రోజుకి రూ.28వేలకు పైగా ఫీజు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. దీంతో కొన్ని చోట్ల కంటైనర్లలో పెట్టి మరీ విక్రయాలు చేస్తుండగా, మరికొందరు దుకాణం దొరికే వరకు ఖాళీ ప్రదేశాల్లో తాత్కాలిక రేకుల షెడ్లను ఏర్పాటు చేసి విక్రయాలకు సన్నాహాలు చేస్తున్నారు.

★ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉన్న ఫ్రిజ్‌లు, స్కానర్లు, ఫేక్ కరెన్సీని గుర్తించే టెస్టర్ యంత్రాలు, కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లను కొనుగోలు చేస్తామంటూ కొత్త దుకాణదారులు ముందుకొచ్చారు. వైకాపా హయాంలో మద్యం విక్రయాలు, లావాదేవీలపై సీబీఐ విచారణ నడుస్తున్న నేపథ్యంలో ఆ సామగ్రి ఇచ్చే అవకాశం లేదు. ఆ సామగ్రిని స్వాధీనం చేసుకొని గోదాములో ఉంచాలని ఆదేశాలున్నాయని, వాటిని విక్రయించాలని ఎటువంటి ఉత్తర్వులు రాలేదని ఎక్సైజ్ అధికారులు తెలియజేశారు

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే:
గణేశ్ – జనక అయితే గనక
రాముల్లు– దేవర
తాజ్ – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి – విశ్వం, వేటుమహారాజ్
(వెల్లంకి) – వేట్టయాన్ ది హంటర్

మర్యాదపూర్వక కలయిక

తాటితూరు (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి నూతన ఎమ్మీడీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎన్. హనుమంతురావును జనసేన భీమిలి మండల కమిటీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ మేరకు కమిటీ అధ్యక్షుడు నక్కా శ్రీధర్ ఆధ్వర్యంలో ఎంపీడీవోను సత్కరించి వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాజగిరి సురేశ్, ఎలుసు సూర్రెడ్డి, గిడిజాల పాపారావు, కొయ్య దిబ్బిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: సుభాష్‌నగర్(సాగర్‌నగర్) ప్రధాన దారిలో పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. –స్థానికులు, సుభాష్‌నగర్
సమాధానం: తవ్విన గోతులను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. –సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: ఎండాడసన్ కళాశాల మీదుగా బీచ్‌రోడ్డును కలిపే ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. –రాజా, ఎండాడ
సమాధానం: త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తాం. –సురేష్, ఏఈ

సమస్య: శిరుగుడినగర్(ఎండాడ) నుంచి ఎండాడ పెట్రోల్ బంకుకు వెళ్లే దారిని అభివృద్ధి చేయాలి. –గోవిందరావు, స్థానికుడు
సమాధానం: క్షేత్ర స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. –సింహాచలం, జోన్–2 కమిషనర్

శిల్పారామం.. ప్రయివేటు పెత్తనం

లీజుకు తీసుకున్న సంస్థల ఇష్టారాజ్యం
విమర్శలకు గురవుతున్న మధురవాడ 'జాతర'

కొమ్మాది, న్యూస్‌టుడే

గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే మధురవాడ శిల్పారామం (జాతర) ప్రయివేటు పరంగా మారుతోంది. గత వైకాపా పాలనలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయకపోగా లీజుల రూపంలో ప్రైవేటు సంస్థలకు దీన్ని ధారాదత్తం చేసింది. దాంతో లీజుదారులంతా వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సందర్శకులు ఆరోపిస్తున్నారు.

గతంలో ఇందులోని కల్యాణమండపంలో పేద, మధ్యతరగతి కుటుంబీకులు తక్కువ అద్దె చెల్లించి వివాహాలు, శుభకార్యాలు వైభవంగా నిర్వహించుకునేవారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా పరిస్థితులు మారుతున్నాయి. ఎంతో విశాలమైన ఈ కల్యాణమండపంతో పాటు గతంలో తెదేపా ప్రభుత్వం నిర్మించిన ఏసీ గదులను సైతం ఆధునీకరించి సొంతంగా నిర్వహించుకునేందుకు ఓ ప్రయివేటు సంస్థకు గత వైకాపా సర్కారు లీజుకిచ్చింది. ఈ మేరకు సీతమ్మధారకు చెందిన దీక్షిత ఎంటర్‌ప్రైజెస్ సంస్థ నెలకు జీఎస్టీతో కలిపి రూ.1,53,043 అద్దె చెల్లించి ఆరేళ్లు నిర్వహించుకునేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ ప్రస్తుతం కల్యాణమండపాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతోంది. ఆ పనులు మరో నెల రోజుల్లో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురానుంది. ఇక్కడ ఇకపై వివాహాలు, శుభకార్యాలు నిర్వహించుకోవాలంటే ఆ సంస్థ చెప్పిన అద్దె చెల్లించాల్సిందే.


లీజుకిచ్చిన కల్యాణమండపాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

జల విన్యాసాలు సైతం అంతే..

10వేల అడుగుల విస్తీర్ణంలో జానస్ ది వాటర్‌పార్క్స్ గత ఏడాది జనవరిలో ప్రారంభించారు. దీన్ని కూడా అయిదేళ్ల లీజుకు ఇచ్చారు. నెలకు రూ.1,28,841 చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దాంతో ఆ లీజుదారుడు జల విన్యాసాల కేంద్రంలో ఇష్టానుసారం ధరలు పెంచి వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సామాన్యుడు ఇక్కడ ఆటవిడుపు కోసం రావాలంటే 'మస్తు'లు చూడాల్సిందేనని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే రీతిలో అర్బన్ ఎక్స్‌పోర్ట్ క్రికెట్ నెట్ సంస్థ సైతం నెలకు కిరాయిగా రూ.8,411 చెల్లించి సాధారణ ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇలా లీజుల రూపంలో ప్రయివేటు సంస్థలకు ఇచ్చేస్తుంటే ఇక్కడికి సందర్శకులు ఎలా రాగలరని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఇతరులు నిర్వహిస్తున్న జల విన్యాస కేంద్రం

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక..

గత వైకాపా పాలనలో శిల్పారామం ప్రత్యేకాధికారి రాజీనామా చేయడం, ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారిణికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడంతో దీని నిర్వహణ పక్కదారి పట్టింది. అప్పటి నుంచి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక్కడ 'పొరుగు సేవల' కింద ఏవోతో పాటు ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీనియర్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, అటెండర్, ఐదుగురు హౌస్‌కీపింగ్, మరో ఐదుగురు సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. మహిళా ఉద్యోగుల సమన్వయం కొరవడి ఇటీవల ఇద్దరు పరస్పరం ఆరోపణలకు దిగడం, అందులో ఒకరు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై స్థానిక పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని, ఆ ఫిర్యాదులో ఆరోపణ వాస్తవమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక ఉద్యోగాల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానాచార్యులు జి.శ్రీనివాసరావు తెలిపారు. ఇంగ్లిష్, కంప్యూటర్స్, చరిత్ర, వృక్ష, జంతుశాస్త్రాలు బోధించేందుకు ఆయా సబ్జెక్టుల్లో 55% అపై మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. పీహెచ్‌డీ, యూజీసీ నెట్, ఏపీసెట్ పూర్తి చేసిన అభ్యర్థులకు, బోధనానుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం, తదితర బోధనాంశాలపై సామర్థ్యం గల వారికి ఎంపికల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారికి చిట్టివలస హైస్కూలు సమీప కళాశాల ప్రాంగణంలో ఈనెల 23వ తేదీ ఉదయం పది గంటలకు ఆంగ్లం, చరిత్రలకు సంబంధించి, 25వ తేదీ ఉదయం కంప్యూటర్స్ సైన్సు, వృక్ష, జంతుశాస్త్రాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 89788 83125 నంబరుకు ఫోనులో సంప్రదించాలన్నారు.

వివాహిత మృతి.. ఆసుపత్రి వద్ద ఆందోళన

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం కార్‌షెడ్డు కూడలిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందడంతో బాధిత కుటుంబీకులు శుక్రవారం సాయంత్రం ఆసుపత్రి వద్ద నిరసన చేపట్టారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలిలా.. గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామానికి చెందిన డి. నరేష్ చిప్పాడ దివీస్ ల్యాబొరేటరీలో ఉద్యోగి. ఈ క్రమంలో భార్య అనూరాధ(29)తో కలిసి తగరపువలసలో నివసిస్తున్నారు. వీరికి సంతానం కలగకపోవడంతో మూడేళ్లుగా ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఆమె గర్భసంచికి సంబంధించి ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు. సాయంత్రానికి ఆ వైద్యం వికటించడంతో ఆసుపత్రి వర్గాలు హుటాహుటిన నగరంలోని వేరొక ప్రయివేటు ఆసుపత్రికి ఆమెను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందిందని భర్తతో పాటు ఆమె బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. పీఎంపాలెం పోలీసులు అక్కడికి చేరుకుని మృతురాలి బంధువులను సముదాయించి పంపించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

23 నుంచి నిత్యాన్నదానం

తగరపువలస, న్యూస్‌టుడే: శ్రీదుర్గాలమ్మ అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ నుంచి తగరపువలసలో నిత్యాన్నదానం నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు తమ్మిన సూరిబాబు, దొంతల పైడిరాజు తెలిపారు. బంగ్లామెట్టపై కొలువైన అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప పీఠం ఆవరణలో డిసెంబరు రెండో తేదీ వరకూ 41 రోజులు అన్నదానం జరగనుందన్నారు. మాలధారణలో ఉన్న స్వాములు, భవానీ భక్తులు ఆయా రోజుల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం పీఠానికి విచ్చేసి ఆహారం స్వీకరించవచ్చన్నారు.

ముగిసిన శిక్షణ

జేవీఅగ్రహారం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి మండలంలోని పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండ్రోజులుగా మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఎమ్పీడీవో ఎన్.హనుమంతురావు, పంచాయతీ విస్తరణాధికారి కె.రమేశ్‌నాయుడు, తదితరులు సభ్యులకు స్థానిక సంస్థల విధులు, హక్కులు, బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్నవారికి ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాసురాజు, జడ్పీటీసీ సభ్యులు వెంకటప్పడు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో సందర్శన

దాకమర్రి(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తి భీమిలి మండల పరిషత్తు కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. కార్యాలయంలోని వివిధ దస్త్రాలను తనిఖీ చేశారు. మండలంలో అమలు జరుగుతున్న పథకాలు, కార్యక్రమాలపై ఆరా తీశారు. ★ మజ్జిపేట సచివాలయాన్ని ఈవోపీఆర్డీ రమేశ్‌నాయుడు శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించారు. పనివేళలను కచ్చితంగా పాటించాలన్నారు. ★ మజ్జివలస జిల్లా పరిషత్తు పాఠశాలను ఎమ్పీడీవో హనుమంతురావు సందర్శించి అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు.

చిప్పాడలో పల్లె పండుగ

చిప్పాడ(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి మండలం చిప్పాడ గ్రామంలో పల్లె పండగ కార్యక్రమం శుక్రవారం జరిగింది. తెదేపా మాజీ జడ్పీటీసీ సభ్యుడు సరగడ అప్పారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఉన్నత పాఠశాల సమీపంలో రూ.15లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాల్వలకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. వైకాపా పాలనలో నిర్వీర్యమైన పల్లెలను తెదేపా ప్రభుత్వం రాగానే పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ సభ్యులు చుక్కా శివాజీ, పాఠశాల హెచ్ఎం రత్నం, సచివాలయ సిబ్బంది, తెదేపా నేతలు సరగడ ఈశ్వరరావు, సరగడ శ్రీరామ్మూర్తి, గుడివాడ అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పాండ్రంగి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాల్వల నిర్మాణానికి స్థానిక తెదేపా నాయకుడు కె.రామరాజు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. స్థానిక నాయకులు మహంతి అప్పలరమణ, పల్లె మహేష్, సభ్యులు పి.వెంకటరావు, బి.సంతోషి, కొసర అప్పలనాయుడు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ★ ఈ కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు రేవిడి, వెంకటాపురం, కోరాడ, బి.ఆర్.తాళ్ళవలస, అయినాడ గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఏసీపీ బాధ్యతల స్వీకరణ



భీమునిపట్నం: భీమిలి జోన్ సహాయ సిటీ ప్లానర్(ఏసీపీ)గా **ఎం.తిరుపతిరావు** శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెండేళ్లుగా ఏసీపీగా పనిచేస్తున్న డి.శ్రీనివాసరావు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ కాగా.. ఏలూరు నుంచి తిరుపతిరావు ఇక్కడకు బదిలీపై విచ్చేశారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం శుక్రవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ బేడా మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

వైభవంగా తులా సంక్రమణ తిరువీధి


సింహగిరి మాడవీధుల్లో ఊరేగింపు

సింహాచలం, న్యూస్‌టుడే: తులా సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి తిరువీధి ఉత్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీలో అధిష్ఠింపజేశారు. పండితులు వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తులను సింహగిరి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు తిరువీధులలో స్వామిని దర్శించుకుని గోవిందనామ స్మరణ చేశారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు


ఐశ్వర్య వేంకటేశ్వరుని సన్నిధిలో అన్నకూటోత్సవం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని శ్రీఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తృతీయ తిరు పవిత్రోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ప్రతీరోజు స్వామికి పవిత్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టగా.. ఆఖరి రోజు శుక్రవారం స్వామికి అన్నకూటోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో దేవాలయ ట్రస్టీలు కె.సూర్యనారాయణమూర్తి, కె.శ్రీరామచంద్రమూర్తి, దేవాలయ అర్చకుడు పి.శేషాచార్యులు పాల్గొన్నారు.

సమర్థ నాయకత్వంతోనే సుపరిపాలన

పద్మనాభం, న్యూస్‌టుడే: ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందినప్పుడే గ్రామాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఉప సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో బి.విజయ్‌కుమార్, ఎంపీపీ కె.రాంబాబు, ఈవోఆర్డీ పి.మీనాకుమారి, ఏవో జయ ఉమా తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

నిత్యావసరాల ధరలు తగ్గించాలని నిరసన

తగరపువలస, న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తగరపువలస కూడలిలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి మరుపల్లి పైడిరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించే చర్యలు చేపట్టాలన్నారు. వంద రోజుల పాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థికభారాన్ని మోపడం సరైన విధానం కాదన్నారు. ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పి దాన్ని అందుబాటులో లేకుండా చేయడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు చిల్ల నర్సింహులు, తూతిక సోమరాజు, మావూరి వీర్రాజు, నేతలు చిల్ల రాంపైడి, నూలు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



తగరపువలసలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి పైడిరాజు



కొమ్మాది కూడలి వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తల ఆందోళన

కొమ్మాది, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలంటూ కొమ్మాది కూడలి వద్ద సీపీఐ మధురవాడ ఏరియా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. పాదచారులకు, వాహనచోదకులకు కరపత్రాలు పంపిణీ చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలపై మోపిన అధిక భారాలను వివరించారు. వెంటనే ఉచితంగా ఇసుక అందించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వాండ్రాసి సత్యనారాయణ, ఎం.డి.బేగమ్, అప్పలరాజు, షేక్ మసీనా, అప్పారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి'

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: విద్యుత్తు సర్దుబాటు (ట్రూఅప్) ఛార్జీలు రద్దు చేయాలంటూ సీపీఎం భీమిలి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస విద్యుత్తు ఉపకేంద్రం వద్ద శుక్రవారం ఉదయం ఆందోళన చేపట్టారు. ముందుగా చిట్టివలసలోని పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి, ఎన్టీఆర్ బైపాస్ కూడలి మీదుగా ర్యాలీగా సబ్ స్టేషన్‌కి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలపై కొత్తగా మరో రూ.8వేల కోట్ల విద్యుత్తు ఛార్జీల భారం వేయడం సరికాదన్నారు. కూటమి సర్కారు వెంటనే దీనిని సమీక్షించి విద్యుత్తు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ ఏఈకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రవ్వ నర్సింగరావు, సీఐటీయూ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగరాణి, నేతలు పంపాన సూర్యనారాయణ, పల్లా పెంటరాజు, నీలాతి రాము, దువ్వి రామకృష్ణ, రీసు చిన్నారావు, చిల్లా కొత్తయ్యరెడ్డి, బోని అప్పారావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఏఈకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

పద్మనాభం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ పద్మనాభం మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ మండల కేంద్రం పద్మనాభంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ అతిథిగా విచ్చేశారు. సమావేశం అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఎం.వి.వి.ఎస్.రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా బోని చిన్నారావు, ఉపాధ్యక్షులుగా డి.వి.పార్వతి, కె.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోల సన్యాసిరావు, కోశాధికారిగా ప్రభాకర్‌రావు తదితరులు ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గ సభ్యులు

పీఎంశ్రీ హైస్కూళ్లు ఉన్నత శ్రేణిలో రాణింపు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకంలో సీబీఎస్సీ సిలబస్‌తో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలలు రానున్న కాలంలో అన్నిరకాల హంగులతో ఉత్తమశ్రేణి విద్యాసంస్థలుగా అభివృద్ధి చెందుతాయని భీమిలి డైట్ కళాశాల ప్రధానాచార్యులు ఎం.జ్యోతికుమారి పేర్కొన్నారు. ఈమేరకు పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు భీమిలి డైట్ కళాశాల ప్రాంగణంలో సమగ్ర శిక్షా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ అంశాల్లో జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. నాలుగు విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో వక్తృత్వ పోటీలో పెందుర్తి ప్రభుత్వ హైస్కూలు(విన్నర్స్), ఆర్.వి.పురం జెడ్పీ హైస్కూలు(రన్నర్స్)గా నిలిచాయి. డిజిటల్ క్వెస్ట్ పోటీలో పెందుర్తి జెడ్పీ హైస్కూలు(విన్నర్స్), ఆనందపురం జెడ్పీ హైస్కూలు(రన్నర్స్), క్విజ్ పోటీలో ఆనందపురం జెడ్పీ హైస్కూలు(విన్నర్స్), చిట్టివలస జెడ్పీ హైస్కూలు(రన్నర్స్), డిస్కవర్, లెర్నింగ్ లోకల్ సైట్స్ పోటీలో చిట్టివలస జెడ్పీ హైస్కూలు(విన్నర్స్), పెందుర్తి ప్రభుత్వ హైస్కూలు(రన్నర్స్)గా నిలిచాయి. జిల్లాస్థాయిలో ఎంపికైన ఈ విజేత పాఠశాలల జట్లు ఈనెల 21 నుంచి 23 తేదీల మధ్య విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని సమగ్రశిక్షా పథకం అకడమిక్ మోనటరింగ్ అధికారి జి.లక్ష్మి పేర్కొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులపై న్యాయమూర్తి ఆరా..


చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పదార్థాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ

కొమ్మాది, ఎండాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులకు వసతులెలా ఉన్నాయో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో జిల్లా న్యాయసేవల సాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ శుక్రవారం పరిశీలించారు. తొలుత చంద్రంపాలెం ఉన్నత పాఠశాల, మారికవలస గిరిజన గురుకుల ప్రతిభ పాఠశాల, కళాశాల (బాలికలు), గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు)లను నిశితంగా పరిశీలించారు. వసతి, భోజనశాల, తరగతి గదులు, మరుగుదొడ్ల తదితర వాటి గురించి విద్యార్థులతో కాసేపు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో అక్షయపాత్ర పంపిణీ చేస్తున్న భోజన పదార్థాలను దస్త్రాలను పరిశీలించారు. అనంతరం పోక్సో చట్టం, బాల్యవివాహాల వల్ల అనర్థాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, సెల్‌ఫోన్ వినియోగం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈవో అనూరాధ, ప్రిన్సిపాళ్లు విశ్వనాధం, శివప్రసాద్, సోమయాజులు తదితరులు పాల్గొన్నారు. ★ అనంతరం న్యాయమూర్తి ఎండాడ జడ్పీ ఉన్నత, గొల్లల ఎండాడ ప్రాథమిక పాఠశాలలను కూడా సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో అనూరాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస అవంతి కళాశాల ఆడిటోరియం వేదికగా బసవపాలెం అవంతి రీసెర్చ్ అండ్ టెక్నలాజికల్ అకాడమీ ఇంజినీరింగు కళాశాల, అవంతి పాలిటెక్నిక్ కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.రాజ్యలక్ష్మీ, అవంతి విద్యా సంస్థల ఛైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేసి, పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త డాక్టర్ వి.రామకృష్ణ, మౌరీటెక్ సాఫ్ట్‌వేర్ ఆపరేషన్స్ హెడ్ నాగవెంకట్, అవంతి సంస్థల వైస్ ఛైర్మన్ నందీశ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, ప్రిన్సిపాళ్లు డాక్టర్ పి.గోవిందరావు, డాక్టర్ హెచ్.దొర, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అధ్వాన దారులు.. తప్పని ఇబ్బందులు

పీఎంపాలెం, మధురవాడ, న్యూస్‌టుడే: పీఎంపాలెం, మధురవాడ ప్రాంతాల్లోని పలు కాలనీల రోడ్లు పలు చోట్ల అధ్వానంగా మారాయి. 8వ వార్డు పరిధిలోని వికలాంగుల కాలనీ నుంచి ఆర్టీసీ కాలనీకి వెళ్లే రోడ్డు, వాంబే కాలనీ, కృష్ణానగర్, మిధిలాపురి వుడాకాలనీ తదితర చోట్ల ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. 6వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలోని పోస్టల్ కార్యాలయం, తులసీనగర్ ప్రాంతాల్లో గుంతలమయంగా మారడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా గోతుల్లో నీరు నిలవడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆయా కాలనీల్లో నెలకొన్న రోడ్ల సమస్యపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి కనీస మరమ్మతులు చేపట్టాలని ఆయా ప్రాంతాలకు చెందిన వారు కోరుతున్నారు.


వికలాంగుల కాలనీ నుంచి ఆర్టీసీ కాలనీకి వెళ్లే మార్గంలో ఇలా.


హౌసింగ్‌బోర్డు కాలనీ పోస్టల్ కార్యాలయం వద్ద..

దర్పణం

తొలగని చెత్త.. వదలని దుర్వాసన

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ మొగదారమ్మ కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం నివాస సముదాయాల వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి చెట్ల కొమ్మలతో అధ్వానంగా తయారైంది. చెత్త కుప్పలు రోడ్డు పక్కన పడేస్తుండడంతో సమీప ప్రాంతాలకు దుర్వాసన వ్యాపించి ఆయా ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించక పోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. వర్షాలకు చెత్త కుళ్లిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే శుభ్రత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మొగదారమ్మ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు

విశాఖ తూర్పు

గృహ రుణాలు మంజూరు చేయండి


బ్యాంకర్లతో మాట్లాడుతున్న ఏడీసీ రమణమూర్తి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పట్టణ పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని, ముఖ్యంగా టిడ్కో ఇళ్లకు సంబంధించి రుణాలివ్వాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి కోరారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో యూసీడీ పీడీ సత్యవేణితో కలిసి బ్యాంకర్లతో సమావేశమయ్యారు. మహిళా సంఘాల రుణాలు, మహిళల స్వయం ఉపాధి అంశాలపైనా చర్చించారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని పీడీ సత్యవేణి పేర్కొన్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం శుక్రవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ బేడా మండపంలోని వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-8లోని 74/బి/2 స్తంభంపై ఉన్న వీధి దీపాలు వెలగటం లేదు. **– జయకాంత్**

సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **– విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్**

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-6లోని భద్రం పార్కు వద్ద చెట్టు ఎండిపోయి కూలిపోయేలా ఉంది. **– హనుమంతరావు**

సమాధానం : పరిశీలించి చెట్టును తొలగిస్తాం. **– దామోదర్, ఉద్యానవనశాఖాధికారి**

జోరుగా జారుతూ... పతకాలు కొల్లగొడుతూ...

స్కేటింగ్‌లో రాణిస్తున్న చిన్నారులు

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

కాళ్లకు చక్రాల బూట్లను ధరించి సాధన చేసిన కొద్ది రోజులకే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. తద్వారా జిల్లా స్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో తొలిసారి పాల్గొని తమ సత్తాను చాటారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు అందుకునేందుకు పునాదులు వేసుకున్నారు. ఇండియన్ అమెచ్యూర్ రోలర్ స్కేటింగ్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు కెరియర్ ప్రారంభించిన ఆరంభంలోనే పతకాలను కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయిలో రాణించేందుకు సిద్ధమవుతున్నారు.


గెలుచుకున్న స్కేటర్లు

తొలిసారే నాలుగు పతకాలు



- పేరు : **ఎ.విజయ్**
- చదువు : యూకేజీ, ఎస్ఎఫ్ఎస్ స్కూలు
- పతకాలు : ఫిగర్, డ్యాన్స్‌లో రజతం, పెయిర్, సోలో ఫ్రీ స్టైల్‌లో కాంస్యపతకం
- ప్రవేశం : ఎంవీపీకాలనీకి చెందిన విజయ్ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏడాది క్రితం స్కేటింగ్‌లో చేరాడు. సోలో డ్యాన్స్, ఫిగర్ స్కేటింగ్‌లో తనదైన ముద్ర వేసుకుని ఆయా విభాగాల్లో రాణిస్తున్నాడు. ఇటీవల జిల్లా స్థాయిలో నాలుగు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నాడు.

స్వర్ణాలపై గురి..



- పేరు : **ఎ.మహీర**
- చదువు : ఒకటో తరగతి, ఏపీఎస్ స్కూలు
- పతకాలు : ఫ్రీ స్టైల్‌లో బంగారు పతకం, ఫిగర్ స్కేటింగ్‌లో కాంస్యం, పెయిర్ స్కేటింగ్‌లో కాంస్యం
- ప్రవేశం : ఇసుకతోటకు చెందిన మహీర రెండేళ్ల క్రితమే కాళ్లకు చక్రాల బూట్లను ధరించి.. ఫ్రీ స్కేటింగ్‌లో ఏకంగా బంగారుపతకం కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో తాను పాల్గొనే అన్ని విభాగాల్లోను స్వర్ణాలు గెలిచేందుకు సాధన చేస్తోంది.

మంచి గుర్తింపు పొందాలని...



- పేరు : **పి.చంద్రశేఖర్**
- చదువు : ఒకటో తరగతి, లిటిల్‌ఏంజిల్స్ స్కూలు
- పతకాలు : కపుల్ డ్యాన్స్, పెయిర్ ఫ్రీస్టైల్‌లో రజతపతకాలు
- ప్రవేశం : ఇసుకతోటకు చెందిన చంద్రశేఖర్ ఏడాదిన్నరగా స్కేటింగ్‌లో సాధన చేస్తున్నాడు. రెండు విభాగాల్లో పతకాలను సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

డ్యాన్స్‌లో సత్తా చాటుతూ..



- పేరు : **జి.హర్షిణి**
- చదువు : ఒకటో తరగతి, భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూలు
- పతకాలు : సోలో ఫ్రీ డ్యాన్స్ బంగారుపతకం, ఫ్రీస్టైల్ స్కేటింగ్‌లో కాంస్యం
- ప్రవేశం : అక్కయ్యపాలేనికి చెందిన హర్షిణి ఎంతో శ్రమిస్తూ సాధన చేస్తోంది. సోలో డ్యాన్స్‌లో మెలకువలను నేర్చుకుంటూ ప్రతిభ చాటుతోంది. మొదటి పోటీల్లోనే సోలో డ్యాన్స్‌లో బంగారుపతకాన్ని గెలుచుకుంది.

ఎంతో ఆసక్తితో..



- పేరు : **పి. సత్య యషిక**
- చదువు : ఒకటో తరగతి, సత్యసాయి విద్యావిహార్
- పతకాలు : కపుల్ డ్యాన్స్, పెయిర్ స్కేటింగ్, ఫ్రీ స్కేటింగ్ (క్వార్డ్)లో రజతపతకాలు
- ప్రవేశం : పెదవాల్తేరుకు చెందిన యషిక స్కేటింగ్‌లో ఆసక్తితో నిత్యం సాధన చేస్తూ జిల్లాస్థాయి పోటీల్లో మూడు రజత పతకాలను సాధించింది. త్రుటిలో బంగారుపతకాన్ని చేజార్చుకోవడంతో భవిష్యత్తులో మరిన్ని సాధించేలా సాధన చేస్తోంది.

స్టూడెంట్ అంబాసిడర్‌గా వెంకటసాయి తేజేష్


ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.శశిభూషణరావు నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న వెంకటసాయి తేజేష్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థి దాసరి వెంకటసాయి తేజేష్ ఏయూ సంబంధిత విభాగం స్టూడెంట్ అంబాసిడర్ టు క్లబ్స్ అండ్ కాలేజీ (ఎస్.ఎ.సి.సి.)గా నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలతో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి.రాంబాబు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాలయంలో ఆయనను అభినందించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే క్లబ్‌లను బలోపేతం చేయడం, సమన్వయ పరచడం, కార్యక్రమాలు నిర్వహించడం జరపాలన్నారు.

హిందీ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: జాతీయ భాష హిందీ ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ఏయూ ఉపకులపతి ఆచార్య గొట్టాపు శశిభూషణరావు అన్నారు. ఏయూ హిందీ విభాగంలో 'హిందీ భాష సాహిత్యాలు - ఒక విమర్శ' అనే అంశంపై శుక్ర, శనివారాల్లో జరగనున్న చర్చాగోష్ఠిని ఆయన ప్రారంభించారు. విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎస్.ఎం.ఎ. ఇక్బాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకుంటే భాషాపరమైన ఇబ్బందులు ఉండవన్నారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, హిందీ విభాగ పూర్వ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, నార్వే నుంచి వచ్చిన ఆచార్య సతీష చంద్ర శుక్ల, మురదాబాద్(యూపీ)కి చెందిన ఆచార్య మహేష్ దివాకర్, అమేధికి డాక్టర్ అర్జున్ పాండే, డాక్టర్ శివం తివారి, డాక్టర్ హరినాథ్ శుక్ల, భోపాల్‌కు చెందిన డాక్టర్ ప్రయాస్ జోషి, బెంగళూరు నుంచి ప్రీతి రాణి, ఛత్తీస్‌గఢ్ నుంచి మహేష్ శర్మ, ఏయూ హిందీ విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావినార్ వీసీ ఆవిష్కరించారు.


చర్చా గోష్ఠి సావినార్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య శశిభూషణరావు

అ వీ ఇ వీ

● న్యాక్ కమిటీ సభ్యులు కృష్ణా డిగ్రీ కళాశాల సందర్శన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు విభాగాల తరగతి గదులు, గ్రంథాలయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం కళాశాల న్యాక్ ఏ గ్రేడ్‌లో ఉంది. వీటిని ఏ++ కు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. న్యాక్ కమిటీ సభ్యులు శనివారం కూడా కళాశాలను సందర్శించనున్నట్లు వెల్లడించారు.

● బీసీ సామాజికవర్గానికి న్యాయం చేయండి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీసీ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని.. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవింద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం తెదేపా జిల్లా కార్యాలయంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనతో పాటు బీసీ కుల గణన రాష్ట్రంలో చేపట్టాలని, నామినేటెడ్ పోస్టుల్లోనూ తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. 100 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు, ఏయూ ఉప కులపతిగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన బీసీని నియమించాలన్నారు. తాటిపూడి జలాశయానికి గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరును యథాతథంగా కొనసాగించాలన్నారు.

వివాహిత ఆత్మహత్యపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై శుక్రవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. విశాఖపట్టణం నగరం మద్దిలపాలేనికి చెందిన పట్టాభి అనూష(32)కు పట్టణానికి చెందిన సవరపు ప్రవీణ్‌కుమార్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ప్రైవేటు పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు పాఠశాలలో ఇచ్చిన లీడర్‌షిప్ బ్యాగు పోగొట్టుకున్నాడు. దీనిపై భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై మనస్తాపం చెందిన అనూష ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై ఆమె తండ్రి పట్టాభి సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేడు దయాల్బాగ్ విద్యార్థుల వస్త్ర ప్రదర్శన


వివరాలు వెల్లడిస్తున్న దయాల్బాగ్ విద్యాకేంద్రం ప్రతినిధులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్‌లోని దయాల్బాగ్ విద్యాకేంద్రంలో డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, టై అండ్ డై తదితర కుట్టు శిక్షణ పూర్తి చేసి ఇంటివద్ద వ్యాపారం నిర్వహించుకుంటున్న మహిళలు తయారు చేసిన వస్త్ర ప్రదర్శన శనివారం ఉషోదయ ఫంక్షనుహాలులో నిర్వహించనున్నట్లు కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు. విశాలాక్షినగర్‌లోని విద్యాకేంద్రం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది శిక్షణ పొందిన, పొందుతున్న మహిళలు తాము తయారు చేసిన చుడీదారులు, పిల్లల దుస్తులు, చున్నీలు, బెడ్‌షీట్లు, లాంగ్ ఫ్రాక్‌లు, నారసంచులు, రుమాళ్లు, కాటన్ చీరలు, నైటీలు ప్రదర్శనతో పాటు అమ్మకం సాగిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక


న్యాక్ కమిటీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు

హెచ్‌బికాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు (స్వయంప్రతిపత్తి హోదా) విచ్చేసిన న్యాక్ కమిటీ సభ్యులకు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.హేమంత్ కుమార్, వెంకటరమణ, ప్రభ, తేజేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ఏయూ రెక్టార్ ఆకస్మిక తనిఖీలు


ఏయూ ప్రగతి మహిళా వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు శుక్రవారం రాత్రి ఏయూ మహిళా వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. తొలుత సీతా మహాలక్ష్మి మహిళ పరిశోధకుల వసతి గృహం సందర్శించి భోజన రుచిని విద్యార్థినులతో కలిసి చూశారు. అలాగే ప్రగతి పీజీ మహిళా విద్యార్థుల వసతి గృహానికి వెళ్లి తనిఖీ చేశారు. అక్కడున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆయా వసతి గృహాల చీఫ్ వార్డెన్లు, వార్డెన్లు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రాణదాతలుగా నిలవాలి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలకు గురైన ఎంతోమంది సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని అనకాపల్లి జిల్లా ఎస్పీ దీపిక అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం విశాలాక్షినగర్‌లోని ఏఆర్ పోలీస్ క్రీడామైదానం సమావేశం మందిరంలో ఎన్టీఆర్ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఎస్పీలు దేవప్రసాద్, ఎల్ మోహనరావులు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించటానికి గల కారణాలు, వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. డీఎస్పీలు వి.నాగేశ్వరరావు, పి.సత్యనారాయణ ఇతర అధికారులు బాలసూర్యారావు, చంద్రశేఖర్, మన్మథరావు, ఆదినారాయణ తదితరులు, ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా ఎస్పీ దీపిక, పోలీసు అధికారులు

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


కార్యక్రమంలో పాల్గొన్న దాత, పాఠశాల సిబ్బంది

శివాజీపాలెం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి 20వ వార్డు శివాజీపాలెం - నౌకానగర్ ప్రాథమిక పాఠశాలలో వైశ్యరాజు జ్యువెలరీ యాజమాన్యం నరేశ్ సహకారంతో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాకుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆధ్యాత్మిక భావనతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో సరస్వతీపూజ చేపట్టారు. దాతలు, పాఠశాల ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

3.5 కిలోల గంజాయి స్వాధీనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో గంజాయి అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో నిఘా ఉంచారు. అనుమానితులను సోదాలు చేయగా, ఇద్దరి వద్ద 3.5 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నాల్గో పట్టణ పోలీసుస్టేషన్‌కు అప్పగించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: పోషకాహారం తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభించి.. రోగనిరోధకశక్తి పెరుగుతుందని కుశాల్ ప్రాజెక్టు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు హేమలత, పార్వతి పేర్కొన్నారు. శుక్రవారం రామ్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రస్తుతం రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుందని, ప్రారంభంలోనే గుర్తిస్తే సరైన చికిత్స పొందవచ్చునన్నారు. నివారణ చర్యలు, రుతుక్రమం ఆగిపోయిన దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు, లబ్ధిదారులు

ఆదర్శనగర్‌లో అన్నదానం


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న నాయకులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆదర్శనగర్ కూడలిలో పోలమాంబ ఆటో స్టాండ్‌లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తూర్పు జనసేన నాయకులు బోగిల శ్రీనివాస్ పట్నాయక్, తెదేపా నాయకులు కాళ్ల శంకర్ పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. పోలమాంబ ఆటో స్టాండ్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్రార్చన


కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పరిధిలోని రవీంద్రనగర్ చివరిబస్టాపు వద్ద దుర్గాదేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీచక్రార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రవీంద్రనగర్, ఎస్ఐజీనగర్, గాంధీనగర్, శాంతినగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. కమిటీ ప్రతినిధులు భక్తులకు కావాల్సిన పూజా సామగ్రి అందించారు. శనివారం సామూహిక లక్ష కుంకుమార్చన, ఆదివారం మహాన్నదానం, మంగళవారం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో అనుపు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పెదగదిలిలో అన్నసంతర్పణ

ఆరిలోవ, న్యూస్‌టుడే: పెదగదిలిలో దుర్గా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన విజయ దుర్గాభవాని మండపం ప్రాంగణంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దూళి రఘు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణ యువజన సేవా సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, తదితరులు


అమ్మవారి ముందు కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సామూహిక కుంకుమ పూజలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ టీబీసీ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. విజయదశమి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిపించామని మండపం పూజారి శ్రీనివాస శర్మ తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపుపై అవగాహన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పన్నుల చెల్లింపుపై అవగాహన పెంచుకోవాలని ఆదాయ పన్నుశాఖ అధికారులు వైద్యులకు సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) విశాఖ ఛాప్టర్, టాక్స్ బార్ అసోసియేషన్ సంయుక్తంగా ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)లో శుక్రవారం వైద్యుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదాయ పన్ను, వైద్యుల కోసం ఉన్న ప్రత్యేక అనుమతులపై సదస్సులో ఐఆర్ఎస్ అధికారి ఎన్.గోపీకృష్ణ, టాక్స్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు పీవీ శేషగిరిరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, హేమంత్‌కుమార్ వివరించారు.

వంతెనకు మరమ్మతులు

ఆరిలోవ, న్యూస్‌టుడే: 11వ వార్డు పరిధి బాలాజీనగర్ ప్రాంతంలో శిథిలావస్థకు చేరిన వంతెన ప్రమాదకరంగా మారడంతో 'ఈనాడు'లో 'వంతెన శిథిలం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు విరిగిన రెయిలింగ్ స్థానే రక్షణ గోడను నిర్మిస్తున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వంతెనపై రక్షణ గోడ నిర్మిస్తున్న కార్మికులు

ఆధునిక సాంకేతికతతో మెరుగైన ఉపాధి అవకాశాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్సు (డీఎస్) తదితర సాంకేతికతలతో భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏపీసీటీ-వైబ్రెంట్ ఎడ్వకసీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (వాణి) సహకారంతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఏఐ, ఎం.ఎల్, డి.ఎస్'పై తెలుగులో నిర్వహించిన చర్చా వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ 2026 నాటికి వీటి అనువర్తనాలను 75 శాతం పైగా వినియోగిస్తారన్నారు. లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టించే శక్తి వీటికి ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దేశ, విదేశీ నిపుణులతో ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు నూతన సాంకేతికతలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీఎస్ఈ విభాగం ఆచార్యులు ఆచార్య ఎం.శశి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే వీటిని బోధించాల్సిన అవసరముందన్నారు. ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతికతను స్థానిక భాషతో అనుసంధానించడంతో మెరుగైన అవగాహన కలుగుతుందన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, చర్చా వేదిక సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ తదితరులు మాట్లాడారు. అనంతరం అమెరికా నుంచి ఏఐ సాంకేతిక భవిష్యత్తు అంశంపై సునీల్ ఎస్ రంక, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ రవి ఈశ్వరపు, న్యూరల్ నెట్ వర్క్స్‌పై విజయ్ ప్రసంగించారు. కార్యక్రమం తెలుగులో నిర్వహించడంతో ఆచార్యులు తెలుగులో ఉపన్యాసం చేసేందుకు ఇబ్బందులు పడ్డారు.



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

ఉద్యోగినికి విద్యుదాఘాతం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ప్రగతిభవన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగిని విద్యుదాఘాతానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం ప్రగతి భవన్‌లో రెండో అంతస్తులోని కార్యాలయంలో ఆమె విధులకు హాజరయ్యారు. ఆ సమయంలో కంప్యూటర్‌ను ఆన్ చేసేందుకు స్విచ్ నొక్కగా వెంటనే విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఆమె అపస్మారకస్థితికి చేరుకున్నారు. సహచర ఉద్యోగులు వెంటనే ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారు. కోలుకున్న తర్వాత ఆమెను ఇంటికి పంపించారు.

ఏయూ థియేటర్ ఆర్ట్స్ విభాగంలో అనర్హులకు ఉద్యోగాలు..!

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గెస్ట్ ఫ్యాకల్టీల భర్తీ ప్రక్రియ ఇటీవల జరిగింది. ఇందులో భాగంగా ఆర్ట్స్, కామర్స్ విభాగాల్లోనూ పలు పోస్టులకు ఎంపిక చేశారు. అయితే థియేటర్ ఆర్ట్స్ విభాగంలో ఆరు పోస్టులను భర్తీ చేయగా అందులో ముగ్గురు అనర్హులన్న ఆరోపణలు ఏయూలో వినిపిస్తోంది. ఈ విభాగంలో అర్హత లేని వారిని నియమించినట్లు చెబుతున్నారు. విభాగంలో గతం నుంచి పని చేస్తున్న కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఒకరు చక్రం తిప్పి అనర్హులను నియమించేందుకు సహకరించినట్లు మాట్లాడుకుంటున్నారు. ఇదే విషయం థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతి, ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు వద్ద ప్రస్తావించగా ఉద్దేశపూర్వకంగానే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ ఆరోపణల్లో వాస్తవం లేదని అన్ని ధ్రువపత్రాలు పరిశీలించిన మేరకు వారికి పోస్టులు ఇవ్వడం జరిగిందన్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం శుక్రవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ బేడా మండపంలోని వేదికపై ఆసీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

10 AM - 1 PM

విశాఖ ఉత్తరం: 80747 24699

విశాఖ దక్షిణం: 80085 66543

మురళీనగర్, న్యూస్‌టుడే

సమస్య: 51వ వార్డు కళింగనగర్ వుడా పార్కు అంతస్తుల సమీపంలో పోల్‌నెం.711బై2బై3బై1 కు ఉన్న విద్యుత్ దీపం గత రెండు నెలలుగా వెలగక అంధకారం అలముకుంటోంది.

– ఎం.వెంకటరమణ, కళింగనగర్

సమాధానం: మీ సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం. – రత్నాకర్, 51వ వార్డు విద్యుత్ ఏఈ.

అల్లిపురం, న్యూస్‌టుడే

సమస్య: జోన్-4 పరిధి సరస్వతి పార్కు నుంచి దాబాగార్డెన్స్ వరకు నో పార్కింగ్ బోర్డుల వద్ద ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. –ఎస్.రాజ్‌కుమార్

సమాధానం: ట్రాఫిక్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతాం. –కె.లక్ష్మి, 2టౌన్ ట్రాఫిక్ ఎస్.ఐ

12.8 కిలోల గంజాయి స్వాధీనం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా ఢిల్లీతో పాటు తమిళనాడు రాష్ట్రానికి గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు యత్నించిన ముగ్గురిని విశాఖలో అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ బృందాలు గస్తీ కాస్తున్న సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనూజ్‌కుమార్, ఇందర్ బుషన్, మహ్మద్ సర్‌కేల గంజాయి బ్యాగులతో స్టేషన్ నిలయంలో రైలు కోసం ఎదురు చూస్తుండగా గస్తీలో ఉన్న ఆర్పీఎఫ్ బృందానికి వీరు చిక్కినట్లు తెలిపారు. రైల్వే పోలీసు బృందాలు బ్యాగులు తనిఖీ చేయగా.. గంజాయి పొట్లాలున్నట్లు గుర్తించారు. దాంతో కేసు నమోదు చేసి 12.8 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. నిందితుల్ని న్యాయస్థానంలో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

300 మీటర్ల దారిలో 16 గోతులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే

జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం వారి నిర్లక్ష్యంగా పనులకు ఈ దారే ఒక ఉదాహరణ.



జాతీయ రహదారికి వెళ్లే దారిలో మ్యాన్‌హోల్ గొయ్యి

ఆరు నెలల కిందట నగరంలోని వీధుల్లో రహదారుల మరమ్మతులు, రహదారుల నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలోనే జీవీఎంసీ 28వ వార్డు పరిధి చిన్నారు మజీద్ వెనకాల 80 అడుగుల రోడ్డు నుంచి నారాయణ స్కూలు మీదుగా అక్కయ్యపాలెం జాతీయ రహదారికి వెళ్లే దారిని పునర్నిర్మాణం చేపట్టారు. ఆ పనుల్లో భాగంగా ఆ రోడ్డులో మ్యాన్‌హోల్స్ వద్ద పని చేశామని చెప్పినట్లు చేశారు తప్పితే.. పూర్తి స్థాయిలో చేపట్టలేదు. దీంతో ఆ మ్యాన్‌హోల్స్ ఉన్నచోట చుట్టూరా గొయ్యిలా ఏర్పడి అడుగు లోతులో భూమిలోకి కూరుకుపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. 300 మీటర్ల పొడవున్న దారిలో 16 మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. వర్షాలకు ఆ మ్యాన్‌హోల్ గోతుల్లో నీరు నిల్వ ఉండటంతో వాహన చోదకులు గోతులు ఉన్నట్లు కన్పించకపోవడంతో చాలామంది తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని అక్కడి నివాసితులు వాపోతున్నారు. వీటిపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని వారు చెబుతున్నారు.



80 అడుగుల రోడ్డు నుంచి నారాయణ స్కూలుకు వెళ్లే దారిలో..

గ్యారీ షరీఫ్ చందనోత్సవం

మాధవధార, న్యూస్‌టుడే: జాకీర్ హుస్సేన్ నగర్‌లో గ్యారీ షరీఫ్ చందనోత్సవ వేడుకలను మసీద్-ఈ-ఆల్‌ఖాదీర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేసి, ఖురాన్ పఠించారు. అనంతరం జాకీర్ హుస్సేన్‌నగర్, మాధవ వీధి, గ్రీన్‌గార్డెన్స్, పార్వతీనగర్ పరిసర ప్రాంతాల్లో చందనోత్సవ ర్యాలీని నిర్వహించారు. కాలనీలో ఉన్న హజరత్ గౌస్ నిషాని వద్ద ఫాతిహా నిర్వహించారు. జెండాను ఎగురవేశారు. కార్యక్రమాన్ని మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

సరకు ఆటోలతో ఇక్కట్లు



రైతుబజార్ గేటు ముందు నిలిపిన ఆటోలు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార రైతు బజార్ ప్రధాన ద్వారం ఎదుట నిలిపివేస్తున్న ఆటోలతో వినియోగదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. నిత్యం ఉదయం, సాయంత్రం సమయాల్లో బజార్ జరుగుతున్న సమయంలో సరకులతో నిండిన ఆటోలు అడ్డుగా పెట్టేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు వీలు పడక ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు అటుగా కూరగాయల సంచులతో బయటకు రావడానికి సంకోచిస్తున్న పరిస్థితి. సాధారణ సమయాల్లో ఇలాగే ఉంటే పండుగల సమయాల్లో ఈ బెడద రెట్టింపు అవుతోందని వారంతా వాపోతున్నారు. బజార్ అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

జై దుర్గాభవానీ...

మురళీనగర్, న్యూస్‌టుడే: 49వ వార్డులో యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. భవానీ మాలధారులు అధిక సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం యువతుల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రధాన వీధుల్లో పల్లకి ఊరేగింపు సేవ నిర్వహించారు. ఉదయం జరిగిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నసమారాధనలో పాల్గొన్న భవానీ మాలధారులు



అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న యువతులు



బ్యాంకర్లతో మాట్లాడుతున్న ఏడీసీ రమణమూర్తి

గృహ రుణాలు మంజూరు చేయండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పట్టణ పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని, ముఖ్యంగా టిడ్కో ఇళ్లకు సంబంధించి రుణాలివ్వాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి కోరారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో యూసీడీ పీడీ సత్యవేణితో కలిసి బ్యాంకర్లతో సమావేశమయ్యారు. మహిళా సంఘాల రుణాలు, మహిళల స్వయం ఉపాధి అంశాలపైనా చర్చించారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని పీడీ సత్యవేణి పేర్కొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళాల అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తెదేపా కార్యాలయంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను శుక్రవారం సాయంత్రం పలువురు కలిసి విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధికి విరాళాలను అందజేశారు. ఏపీ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ తరపున రూ.లక్ష, విశాఖకు చెందిన ఎస్.జోగేంద్ర రూ.లక్ష చొప్పున మంత్రి లోకేశ్‌కు విరాళంగా అందజేశారు.

అథ్లెటిక్స్‌లో ఉద్యోగిని ప్రతిభ



పతకాలను చూపుతున్న మీనాకుమారి

మురళీనగర్, న్యూస్‌టుడే: ఆలిండియా పబ్లిక్ సెక్టర్ అథ్లెటిక్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగిని కె.మీనాకుమారి ప్రతిభ కనబరిచారు. డెహ్రాడూన్‌లో గురువారం వరకు జరిగిన ఈ టోర్నమెంట్‌లో 400మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో రెండవస్థానంలో రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ అధికారులు, సహోద్యోగులు ఆమెను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యుత్తు భారం రద్దు చేయాలి

గురుద్వారా, న్యూస్‌టుడే: విద్యుత్తు ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.8114 కోట్ల భారం మోపడం తగదని, వీటిని తక్షణమే రద్దుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం గురుద్వారా ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం వేయమని ఎన్నికల్లో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన 120 రోజుల్లో ఛార్జీలు పెంచడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు సంస్కరణల పేరిట స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి ప్రజలపై భారాలు వేయడానికి పూనుకుందని పార్టీ నాయకులు ఆర్.కె.ఎస్.వి కుమార్ ఆరోపించారు. ఈ భారాలకు వ్యతిరేకంగా నవంబర్ 8 నుంచి 15వ వరకు ప్రజా పోరు కార్యక్రమం ద్వారా ఇంటింటికీ సీపీఎం వెళ్లి ప్రజలను చైతన్యపరిచి సచివాలయాల దరి ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాగునీటి కోసం కటకట



సీతంపేటలో కొళాయి నీటికోసం బిందెలతో ఎదురు చూస్తున్న మహిళలు

సీతంపేట, న్యూస్‌టుడే: తాగునీటి కోసం నగరంలో సగం ప్రాంతం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్వారకా బస్ స్టేషన్ సమీపంలోని టౌన్ సప్లై రిజర్వాయర్(టి.ఎస్.ఆర్) నిండుకోవడంతో నీరు అందించలేకపోయారు. దీంతో దొండపర్తి, సీతంపేట, ఒన్‌టౌన్ ఏరియా, కమిషనరేట్ ప్రాంతం, సిరిపురం, గవర్నర్ బంగ్లా ప్రాంతం, పెదవాల్తేరులోని కొన్ని వీధులకు శుక్రవారం నీరు అందలేదు. ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నరవ వద్ద పంప్‌హౌస్‌లో మోటార్లు పనిచేయకపోవడంతో అక్కడి నుంచి నీరు రాకపోవడం వల్ల తాగునీరు అందించలేకపోయామని జీవీఎంసీ వాటర్ వర్క్స్ సిబ్బంది తెలిపారు. అక్కడ మోటార్లు తరచూ ఇబ్బంది పెడుతుంటాయని, గ్రామీణ ప్రాంతం కావడంతో విద్యుత్తు సరఫరాలో లోపం వల్ల కొన్ని సార్లు సకాలంలో నీరు అందకపోతే... మరికొన్ని సార్లు మోటార్లు పనిచేయకపోవడం వల్ల నీరు టి.ఎస్.ఆర్ వరకు రావడంలేదని చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు మహిళలు బిందెలతో ఆయా ప్రాంతాల్లో కొళాయిల వద్ద పడిగాపులు కాశారు. నీరు రాకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడ్డారు.

అన్న సమారాధన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఎన్‌జీజీఓఎస్ కాలనీలోని మక్బూల్ లేఅవుట్ వద్ద శ్రీ దుర్గా అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం కమిటీ సభ్యులు ఉప్పాడ రాము ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పోతు నాగమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాపిరాజు, భాషా, కె.సత్తిబాబు, కె.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు వడ్డన చేస్తున్న దృశ్యం

విశ్వనాథ సాహిత్య సమాలోచనపై చర్చావేదిక

సీతంపేట, న్యూస్‌టుడే : విశాఖ పౌరగ్రంథాలయంలో విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా విశ్వనాథ సాహిత్య సమాలోచనపై చర్చావేదికను గ్రంథాలయం నిర్వహించింది. ఈ చర్చకు గ్రంథాలయం సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ పేరి రవికుమార్, ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ విశ్వనాథ బహుముఖ ప్రతిభను, మేధా సంపత్తిని దృష్టాంతాలతో విశ్లేషించారు. పేరాల హరిప్రియ, డాక్టర్ జి.ఇందిర, మేడా మస్తాన్ రెడ్డి, డాక్టర్ అతుకూరి వెంటేశ్వర్లు, చిన సూర్యనారాయణ, డాక్టర్ పేరాల బాలమురళీ మొదలైన వారు విభిన్న అంశాలపై ప్రసంగించారు.



విశాఖ పౌరగ్రంథాలయంలో చర్చా వేదికలో పాల్గొన్న రచయితలు

38వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన



స్థానిక మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని 38వ వార్డులో నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో అమ్మవారి దేవాలయానికి వెళ్లే రహదారి విస్తరించాలని కోరారు. విక్టోరియా ఆసుపత్రి ఆవరణలో అదనపు భవనం నిర్మాణం చేపట్టాలని, పాత తాలూకా కార్యాలయం, మున్సిపల్ టౌన్‌హాల్ ఆధునికీకరించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పోలీసు క్వార్టర్స్‌లో భవనాలు శిథిలదశలో ఉన్నాయని, వాటిని తిరిగి నిర్మించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలను స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. జెడ్పీ మల్లయ్యనాయుడు, కూటమి నాయకులు శివ, నరసింహాచారి, ఉమ, సత్యనారాయణ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కేజీహెచ్ ఎనస్తీషియా విభాగ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కె.కూర్మనాథ్ అన్నారు. వేదాంత వీజీసీబీ పోర్టు, అఫ్రో(యాక్షన్ ఫర్ ఫుడ్ ప్రొడక్షన్) సంయుక్తంగా శుక్రవారం పోర్టు ఏరియాలోని మత్స్యశాఖ సామాజిక భవనంలో మత్తు పదార్థాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం, అమ్మకాలు చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం గోడ పత్రికలను విడుదల చేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు సుంకాన శ్రీనివాస్, టీవీడీ దాస్, శ్రీలక్ష్మి, వై.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న డాక్టర్ కె.కూర్మనాథ్, పోలీసు అధికారి బి.భాస్కర్ తదితరులు

కూటమి శ్రేణులందరికీ అండగా ఉంటా: ఎమ్మెల్యే



35వ వార్డు తెదేపా అధ్యక్షుడు బొచ్చ రాము రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: తన గెలుపునకు కృషి చేసిన కూటమి శ్రేణులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. 35వ వార్డు తెదేపా అధ్యక్షుడు బొచ్చ రాము రెడ్డి అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరడంతో ఆయనను శుక్రవారం ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు

పన్నుల చెల్లింపుపై అవగాహన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పన్నుల చెల్లింపుపై అవగాహన పెంచుకోవాలని ఆదాయ పన్నుశాఖ అధికారులు వైద్యులకు సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) విశాఖ చాప్టర్, టాక్స్ బార్ అసోసియేషన్ సంయుక్తంగా ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)లో శుక్రవారం వైద్యుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదాయ పన్ను, వైద్యుల కోసం ఉన్న ప్రత్యేక అనుమతులపై సదస్సులో ఐఆర్ఎస్ అధికారి ఎన్.గోపీకృష్ణ, టాక్స్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు పీవీ శేషగిరిరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, హేమంత్‌కుమార్ వివరించారు. ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఉప ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఐఎంఏ విశాఖ చాప్టర్ అధ్యక్షులు డాక్టర్ పీజే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీసీ మృతి బాధాకరం



శ్రీనివాసరావుకు మృతికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటరు(ఏపీసీ)గా సేవలందించిన బి.శ్రీనివాసరావు మృతి చాలా బాధాకరమని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం జిల్లా డీపీఓగా బదిలీపై వెళ్లి గురువారం ఆయన గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీనివాసరావు మృతి పట్ల శుక్రవారం కలెక్టరేట్ జరిగిన సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఇతర అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళల అరెస్టు

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండల కేంద్రంలోని తిరుమల బంగారం, వెండి ఆభరణాల దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను రాపాక కూడలి వద్ద శుక్రవారం అరెస్టు చేసి.. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.సత్యనారాయణ, ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఈ నెల 9న విశాఖపట్నం అల్లిపురానికి చెందిన షేక్‌బాను, దేశిరాజు ధనలక్ష్మి పొందూరులోని ఆభరణాల దుకాణానికి కొనుగోలుకు వచ్చినట్లు నమ్మించి 60.700 తులాల వెండి పట్టీలను దొంగిలించారు. దుకాణ యజమాని సీసీ టీవీ ఫుటేజీలో చూసి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా మహిళలను గుర్తించి ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ప్రతి మూడో శుక్రవారం ఉద్యోగుల ఫిర్యాదుల స్వీకరణ

సూర్యబాగ్ (అల్లిపురం), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నెల మూడో శుక్రవారం కార్యదర్శులు, ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు జెడ్సీ ఎం.ఎం.నాయుడు పేర్కొన్నారు. సూర్యబాగ్‌లోని జోన్-4 కార్యాలయంలో శుక్రవారం వార్డు సచివాలయాల కార్యదర్శుల సమస్యల వేదిక నిర్వహించారు. కార్యదర్శుల సమస్యలను ప్రతి మూడో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి, కార్యాలయాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తమకు విన్నవించుకోవచ్చన్నారు. ఉద్యోగులకు కార్యాలయాల్లో మంచి పని వాతావరణం కల్పించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొదటి రోజున ముగ్గురు ఫిర్యాదులు అందించారు. వాటిని త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు.



కార్యదర్శుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ ఎం.ఎం.నాయుడు

నడక మార్గంపై వ్యక్తి మృతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహారాణిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని చిత్రాలయ థియేటర్ రహదారి నడకమార్గంపై శుక్రవారం ఉదయం మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విచారణ జరపగా.. రీడింగ్‌రూం సమీపంలోని గాంధీపేటకు చెందిన సత్యనారాయణ (38)గా గుర్తించారు. మృతుని తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతునికి ఇంకా వివాహం కాకపోవడంతోపాటు, మద్యం అలవాటు ఉందని, గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాల్యం విద్యార్థులకు అభినందన



ప్రతిభ చూపిన బాల్యం విద్యార్థులతో మేయరు గొలగాని హరి వెంకట కుమారి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: న్యూ దిల్లీకి చెందిన ఛైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్ సంస్థ నిర్వహించిన పోటీలో మహా విశాఖ నగరపాలక సంస్థ బాల్యం విద్యార్థులు ప్రతిభ చూపారు. శుక్రవారం మేయరు గొలగాని హరి వెంకట కుమారి వారిని ప్రధాన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయి లైవ్ కాంపిటేషన్‌లో బాల్యం విద్యార్థులకు అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. సెప్టెంబర్ 29న జాతీయస్థాయి లైవ్ కాంపిటేషన్‌లో బాల్యం విద్యార్థులు ప్రతిభ చూపినట్లు సంస్థ నిర్వాహకులు తెలియజేశారు. 18 రాష్ట్రాలలోని 86 జిల్లాల నుంచి 543 మంది 3 నుంచి 5ఏళ్లలోపు విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తారకరామనగర్ బాల్యం కేంద్రం విద్యార్థి దత్తి తనుశ్రీ, కప్పరాడ బాల్యం విద్యార్థి కొల్లాబత్తుల సోనిక, శివాలయం బాల్యం కేంద్రం విద్యార్థి కొడమంచిలి కావ్యికలు పద్యాలు, పాటలు, పద్యపఠనం విభాగాల్లో పోటీలో ప్రతిభ చూపారన్నారు. అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, విద్యా విభాగం పర్యవేక్షకులు చిన్నమ్మలు, బాల్యం నిర్వాహకుడు ఆవుపాటి మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక
• గాజువాక • విశాఖ పశ్చిమం

'కొరవడిన భద్రతా ప్రమాణాలు'

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం నేవల్ డాక్‌యార్డు సమీప పైపులైన్ కూడలిలో భారీ క్రేన్ ఒరిగిపోయిన ఘటనపై శుక్రవారం విశాఖ హెవీ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.రామారావు, వి.చంద్రశేఖర్ స్పందించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) అధికారులు పని ప్రదేశంలో సరైన భద్రత, ప్రమాణాలు పాటించలేదని ఆరోపించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు మహారాష్ట్రలో ఉంటే, ఇక్కడ క్రేన్‌తో ఓవర్‌హెడ్ పైప్‌లైన్ ఏర్పాటు పనుల్ని అనుభవం లేని సిబ్బందితో చేయించారన్నారు. కీలకమైన పనుల్లో తాళ్ల స్వింగ్ నిరోధక వ్యవస్థ ఏర్పాటు చేయలేదని, కనీసం సిగ్నల్ ఇచ్చేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచలేదన్నారు. వాతావరణ హెచ్చరికలు పట్టించుకోకుండా... భారీ యంత్రంతో రోడ్డుపై పనులు చేయడంతోనే ప్రమాదం జరిగిందని వారు అభిప్రాయపడ్డారు.

20న వైద్యశిబిరం ఏర్పాటు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే : అక్కిరెడ్డిపాలెం-నాతయ్యపాలెం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 20న వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని సంఘం అధ్యక్షులు సున్నం గాంధీగుప్తా తెలిపారు. శుక్రవారం అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో శిబిరం కరపత్రాలు, గోడపత్రిక ఆవిష్కరించారు. మెడికవర్, పుష్పగిరి కంటి ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సభ్యులు కుమారస్వామి, శ్రీరామ్మూర్తి, కుమారగుప్తా, తెలికి పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ఐక్యంగా కదిలే..

సింధియా, న్యూస్‌టుడే : తూర్పు నౌకాదళం విశాఖపట్నం పరిధిలో శుక్రవారం 4.0 స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి. అన్ని నేవల్ యూనిట్ల పరిసరాల్లో సిబ్బంది శ్రమదానం చేసి, ఆయా కార్యాలయాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారని స్పష్టం చేశాయి. స్వచ్ఛ కార్యక్రమాలు నెలాఖరు వరకు కొనసాగుతాయని పేర్కొన్నాయి. ఆయా యూనిట్ల సిబ్బంది పాల్గొన్నారని తెలిపాయి.


వ్యర్థాలు సేకరిస్తున్న నేవీ సిబ్బంది

సృజనకు పదును



గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభాలు-నష్టాలు', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై చేపట్టిన వ్యాసరచన పోటీల్లో సుమారు 78 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశాలను విద్యార్థులు తమదైన శైలిలో విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. ప్రతిభ చూపిన పదో తరగతి విద్యార్థులు జి.సాయిపూజిత, ఎస్.తేజశ్, జి.వెన్నెలకు పాఠశాల హెచ్ఎం కె.విజయ ప్రశాంతి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. –న్యూస్‌టుడే, అక్కిరెడ్డిపాలెం, గాజువాక

ఎండైనా, వానైనా.. గొడుగు నీడలోనే..!



క్లిక్ క్లిక్

ఎండైనా.. వానైనా.. పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం బస్‌స్టాపులో గొడుగుల నీడలోనే ప్రయాణికులు నిరీక్షించాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి ఇక్కడి బస్‌స్టాపులో షెల్టర్ నిర్మాణం లేక ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు వినతులు అందించినా... ఆర్టీసీ యాజమాన్యం గాని, జీవీఎంసీ అధికారులు గాని స్పందించలేదు. అలాగే సామాజిక బాధ్యతగా పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు రాలేదు. సుమారు పదేళ్ల కిందట రోడ్డు విస్తరణ పనులకు, షెల్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. నేటికీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. షెల్టర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, సింధియా

చీకట్లు.. తప్పని ఇక్కట్లు..!

ఎన్ఏడీకూడలి వంతెనపై వెలగని వీధిదీపాలు

న్యూస్‌టుడే, ఎన్ఏడీకూడలి(కాకానినగర్): విశాఖలో వీధి దీపాల సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం చీకట్లో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఇదే అదునుగా ఆకతాయిలు, మద్యం తాగిన వారు... ఒంటరిగా వెళ్లే వృద్ధులు, మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

● ఎన్ఏడీకూడలి పైవంతెన మీద ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు అధ్వానంగా మారాయి. నాణ్యత లేని దీపాలు ఏర్పాటు చేయడంతో కొన్ని మిణుకు మిణుకుమంటూ వెలుగుతుంటే, మరికొన్ని పూర్తిగా వెలగడం లేదు.


గోపాలపట్నం వెళ్లే మార్గంలో...

● లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి వంతెనకు నాలుగు వైపులా గతంలోనే విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. అయితే అటు గాజువాక, ఇటు మద్దిలపాలెం వైపు వెళ్లే మార్గాల్లో దీపాల వెలుగులు ఉండడం లేదు. కరాస, గోపాలపట్నం వైపు నుంచి వచ్చే మార్గాల్లోనూ ఇదే పరిస్థితి.

● చీకటి దారుల్లో ప్రయాణించే పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు వంతెన పరిసరాలన్నీ చీకటిగా మారడంతో చాలా మంది అక్కడే మద్యం తాగుతున్నారు. ఆకతాయిలు వంతెన కిందే తిష్ఠ వేసి పలువుర్ని ఇబ్బందులు పెడుతున్నారు.


గాజువాక వైపు వెళ్లే రోడ్డులో..

● ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించడంతో పాటు, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

రహదారిలో అడ్డంకులపై ఆందోళన


శ్మశానం రోడ్డుపై పోసిన మట్టి

అగనంపూడి, న్యూస్‌టుడే: ఫార్మాసిటీ పునరావాస కాలనీ శ్మశానానికి వెళ్లే మార్గంలో అడ్డంగా మట్టికుప్పలు పోయడంపై నిర్వాసితులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఆ వివరాలు. . కాలనీకి సమీపంలో ఉన్న లోటస్ వైర్‌లెస్ పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులు సంస్థ లోపల వివిధ పనుల నిమిత్తం తవ్విన మట్టిని తీసుకొచ్చి రహదారికి అడ్డంగా పోశారు. ఇటీవల వర్షాలకు ఆ ప్రాంతమంతా బురదమయంగా మారింది. శుక్రవారం కాలనీకి చెందిన ఓ వివాహిత అనారోగ్యంతో మృతి చెందడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి తీసుకెళ్లారు. బురదమార్గంలో శ్మశానవాటికకు చేరుకునేందుకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనధికారికంగా మట్టి పోసిన సంస్థ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమ గేటు వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. స్పందించిన యూనిట్ ఇన్‌ఛార్జి శేఖర్ కాలనీవాసులతో చర్చించారు. 15 రోజుల్లో మట్టిని తొలగిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా శాంతించారు. గడువులోపు మట్టి తొలగించకపోతే ఆందోళనలు చేస్తామని నిర్వాసిత నాయకులు దాసరి రమేష్, అచ్యుతరావు, గణేష్, శ్రీను, సత్యనారాయణ తదితరులు స్పష్టం చేశారు.


పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగిన కాలనీవాసులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గోపాలపట్నం

?: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రోడ్డు మొత్తం గోతులతో అధ్వానంగా ఉంది. వాహన రాకపోకల సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. –శ్రీనాథ్, నరవ

?: బాజీకూడలి నుంచి పాతగోపాలపట్నం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడ వర్షం నీరు నిలిచిపోతుంది.
–బి.రాంబాబు, పాతగోపాలపట్నం

✔ : నరవ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. పాతగోపాలపట్నం రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం.
–వెంకటలక్ష్మి, ప్రజా పనుల విభాగం, ఏఈ

?: వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్ పార్కులో వీధి దీపాలు వెలగడం లేదు.
–ఎన్.సాహితీ, వుడాలేఅవుట్ కాలనీ

✔ : వీధి దీపాల సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.
–శ్రీధర్, వార్డు కార్పొరేటర్

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

కూర్మన్నపాలెం(దువ్వాడ): దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ అన్ని ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లీ సూచించారు. శుక్రవారం దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు విలువ చేసుకుని, సమాజంలో పలువురికి అవగాహన కల్పించాలన్నారు. సమాజ మార్పునకు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపల్ జె.సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.సన్యాసిరావు, డీన్‌లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీవల్లీ

కష్టపడి పని చేసే వారికి గుర్తింపు


వివరాలు నమోదు చేస్తున్న భాజపా నాయకులు

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : జీవీఎంసీ 70వ వార్డు ఎర్రగడ్డ కాలనీలో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, పావని ఆధ్వర్యంలో పలువురి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, లబ్ధిదారులకు పథక సాయం అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. వార్డుల్లో సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తుందన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే : రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం తుంగ్లాంలో కాకి కుంచారావు వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వందేభారత్, అమ్మ బ్లడ్‌బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. దాతలను గోవిందరెడ్డి అభినందించారు. కుంచారావు స్నేహితులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : జీవీఎంసీ 76వ వార్డు బర్మాకాలనీలో శుక్రవారం అదానీ పోర్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య సిబ్బంది సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు.


శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

ఉక్కు పరిరక్షణకు కూటమి కృషి



మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఉక్కు పరిశ్రమను కాపాడే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని, కార్మికులెవరూ ఆందోళన చెందొద్దని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో కొనసాగుతున్న రిలే దీక్షా శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ఇప్పటికే కేంద్రం స్పందించి కొంత మేర ఆర్థికసాయం చేసిందని గుర్తు చేశారు. వైకాపా నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు ఎవరూ నమ్మొద్దని ఆయన పిలుపునిచ్చారు. కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామరావు, స్టీల్ టీఎన్‌టీయూసీ నాయకులు నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్ర, పి.సోమునాయుడు, ఎం.రఘుప్రసాద్, కె.శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో సినిమాలు

శ్రీనరసింహా: జనక అయితే గనక, నరసింహా: వేట్టయన్, సౌజన్య: విశ్వం, సుకన్య: దేవర, మౌర్య: మార్టిన్

ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-2: వేట్టయన్, స్క్రీన్-3: విశ్వం, స్క్రీన్-4: దేవర, స్క్రీన్-1: జనక అయితే గనక

సంక్షిప్త సమాచారం..

● 20న విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గాజువాక, న్యూస్‌టుడే : పెదగంట్యాడ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 20న పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బీకే.నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.

● అభివృద్ధి పనుల పరిశీలన

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : 90వ వార్డు లక్ష్మీనగర్ శివాలయం వీధిలో సుమారు రూ.16 లక్షల ప్రభుత్వ నిధులతో మురుగు కాలువలు నిర్మిస్తున్నారు. ఆయా పనులను శుక్రవారం వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుడికి సూచించారు.

● నేవీ ఉద్యోగి అరెస్టు

సింధియా, న్యూస్‌టుడే : వివాహిత ఆత్మహత్య కేసుకు సంబంధించి శుక్రవారం ఆమె భర్తను మల్కాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలు... పారిశ్రామిక ప్రాంతం బర్మాకాలనీలో నివాసం ఉండే నేవీ ఉద్యోగి విక్కీకుమార్ భార్య కుసుమకుమారి ఈనెల 16న ఆత్మహత్య చేసుకున్నారు. వివాహమైన నాలుగేళ్లకే కుసుమకుమారి ఆత్మహత్యకు పాల్పడ్డంతో... ఝార్ఖండ్ నుంచి వచ్చిన ఆమె బంధువులు విక్కీకుమార్‌పై అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. వారి ఫిర్యాదుతో పోలీసులు చర్యలు చేపట్టారు. సీఐ ఎస్.విద్యాసాగర్ దర్యాప్తు చేస్తున్నారు.

● ట్రాఫిక్ సమస్యపై విన్నపం

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి హనుమాన్ కూడలిలో వాహనాలకు ఫ్రీలెఫ్ట్ సదుపాయం కల్పించాలని స్థానిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. శుక్రవారం అగనంపూడిలో పర్యటించిన దువ్వాడ ట్రాఫిక్ ఎస్ఐ డి.వరలక్ష్మిని కలిసి సమస్య వివరించారు. లంకెలపాలెం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే వాహనాలతో పాటు ఉక్కునగరం అనుసంధాన మార్గం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలకు ఫ్రీలెఫ్ట్ ఇస్తే కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని ఎస్ఐ బదులిచ్చారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బి.సత్యనారాయణ, శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : కుట్టు శిక్షణతో మహిళలు స్వయం ఉపాధిలో రాణించొచ్చని రోటరీక్లబ్ గవర్నర్ వెంకటేశ్వరరావు, మాజీ గవర్నర్ సుబ్బారావు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 72వ వార్డు సమతానగర్ రోటరీ క్లబ్‌లో అధ్యక్షుడు శీరట్ల వాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురి మహిళలకు కుట్టుమిషన్లు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ కోల్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు 15 రోజుల శిక్షణ ఇచ్చి, మిషన్లు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతినిధులు కృష్ణారెడ్డి, సూర్యనారాయణ, రాజు, లక్ష్మణరావు, హేమంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం చేస్తే సహించం : సీపీఎం

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య కార్మికుల్ని డ్వాక్రా గ్రూపుల్లో చేరాలని ఆర్పీలు ఒత్తిడి చేయడం సరికాదని సీపీఎం నాయకుడు రాంబాబు అన్నారు. శుక్రవారం గాజువాక సీపీఎం కార్యాలయం ఆవరణలో కార్మికులు నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. మస్తర్ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య కార్మికుల వివరాలను డ్వాక్రా గ్రూపుల ఆర్పీలు సేకరిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒప్పంద పారిశుద్ధ్య కార్మికుల్ని ఆప్కాస్‌లో విలీనం చేసి సంక్షేమ పథకాలకు దూరం చేశారని, ఇప్పుడు డ్వాక్రా గ్రూపుల్లో చేర్పించి పథకాలు అందకుండా చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదేశాలు లేకుండా జాబితాలు తయారు చేస్తే ఆందోళనలు చేస్తామన్నారు. నాయకుడు జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సభ్యుల ఐక్యతతో సంఘం బలోపేతం



కార్పొరేటర్ వెంకటరమేశ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : సభ్యుల ఐక్యతతోనే సంఘాలు బలోపేతం అవుతాయని జీవీఎంసీ 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ అన్నారు. శుక్రవారం వార్డు పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో సింహాద్రి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ... సభ్యులంతా సేవా కార్యక్రమాలు చేస్తూ, సమాజాభివృద్ధికి చేయూత ఇవ్వాలన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు బి.అప్పారావు, జగన్నాథరావు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే : జీవీఎంసీ 66వ వార్డు అజీమాబాద్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మునగాకు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. కేంద్రం సిబ్బంది నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ... మునగాకుతో అనేక పోషకాలు అందుతాయని వివరించారు. కేంద్రం సిబ్బంది, బాలలు, స్థానికులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

తండ్రికి కొరివి పెట్టిన తనయ

కూర్మన్నపాలెం: తండ్రి మృతదేహానికి కుమార్తె అంత్యక్రియలు నిర్వహించిన ఘటన శుక్రవారం కూర్మన్నపాలెంలో చోటు చేసుకుంది. స్థానిక నివాసి అయిన బి.శ్రీనివాసరావు తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారిగా పని చేస్తూ, రాజమహేంద్రవరంలో ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అక్కడే ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స అందించారు. ఉదయం 6.45 గంటలకు మరోసారి గుండెపోటు రావడంతో ఆసుపత్రిలోనే మృతి చెందారు. మృతదేహాన్ని కూర్మన్నపాలెం తీసుకొచ్చి శుక్రవారం ఉదయం అంత్యక్రియలు జరిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రావ్య తలకొరివి పెట్టారు. ఆయన సోదరుడు, ఉక్కు విశ్రాంత ఉద్యోగి సత్యప్రసాద్ తదితరులు కన్నీటి వీడ్కోలు పలికారు.

పూడిక వ్యర్థాలు తరలించరూ..! ఫోకస్



జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ కూడలిలో ఉన్న మురుగు కాలువలో భారీగా పేరుకుపోయిన వ్యర్థాలను శుక్రవారం తొలగించి.. రోడ్డుపైనే వదిలేశారు. తీవ్ర దుర్వాసనతో పాటు, మురుగు నీరంతా రోడ్డుపై ప్రవహించింది. దీంతో రాకపోకలు సాగించే వారు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి... పూడిక వ్యర్థాలు వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, మల్కాపురం

విశాఖ చేరిన జవాను మృతదేహం

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : జమ్మూకశ్మీర్‌లో మృతి చెందిన సైనికోద్యోగిని శుక్రవారం విశాఖ విమానాశ్రయానికి తీసుకొచ్చారు. ఆ వివరాలు.. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పరవాడపాలెం గ్రామానికి చెందిన పరవాడ నాయుడుబాబు (37) జమ్మూకశ్మీర్‌లో జవానుగా పని చేస్తున్నారు. గురువారం ఆయన స్వగ్రామానికి బయలుదేరిన సమయంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం రాత్రి విశాఖ తీసుకొచ్చి, స్వగ్రామానికి తరలించారు. 2010లో సైన్యంలో చేరిన ఆయన వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ఏడాదిన్నర క్రితం వివాహమైంది. నాయుడుబాబు మృతితో భార్య శాంతి స్వరూప, ఇతర కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



సైనిక వందనం అందిస్తున్న నేవీ సిబ్బంది